మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

Circulated to Telangana
Published from Jagitial

www.evarthalu.com

శుక్రవారం FRIDAY 28-8-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 60 Issue: 60




28 ఆగస్టు 2026 - శుక్రవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:05 సూర్యాస్తమయం - సా. 6:29 తిథి పౌర్ణమి ఉ. 9:46 వరకు తరువాత పాడ్యమి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం శతభిష తె. 3:02ం వరకు తరువాత పూర్వాభాద్ర యోగం అతిగండ ఉ. 7:24 వరకు కరణం బవ ఉ. 9:46 వరకు భాలవ రా. 9:53 వరకు వర్జ్యం ఉ. 9:44 నుండి ఉ. 11:24 వరకు దుర్ముహూర్తం ఉ. 8:34 నుండి ఉ. 9:23 వరకు మ. 12:42 నుండి మ. 1:31 వరకు రాహుకాలం ఉ. 10:44 నుండి మ. 12:17 వరకు యమగండం మ. 3:23 నుండి సా. 4:56 వరకు గుళికాకాలం ఉ. 7:38 నుండి ఉ. 9:11 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:29 నుండి తె. 5:17 వరకు అమృత ఘడియలు రా. 7:43 నుండి రా. 9:23 వరకు అభిజత్ ముహూర్తం ఉ. 11:52 నుండి మ. 12:42 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



## లో బీమ్‌లోనే లైట్లు!

### కొత్త వాహనాల్లో ఆటోమేటిక్ హెడ్‌ల్యాంప్

కొత్త ద్విచక్ర వాహనాల్లో ఆటోమేటిక్ హెడ్‌ల్యాంప్ వ్యవస్థలో ఇకపై తక్కువ వెలుతురు (లో బీమ్) మాత్రమే పనిచేసేలా నిబంధనలు మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది.

న్యూఢిల్లీ: ఈ మేరకు కేంద్ర రహదారి రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ కేంద్ర మోటారు వాహన నిబంధనలకు సవరణలు ప్రతిపాదిస్తూ ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేసింది. ముసాయిదా ప్రకారం 2028 ఏప్రిల్ 1 నుంచి కొత్త ద్విచక్ర వాహనాల్లో ఆటోమేటిక్ తరువాయి 2 వ పేజీలో...



## బంకుల్లో ఈ-10 పెట్రోల్!

### పాత వాహనదారులకు బీపీసీఎల్ గుడ్‌న్యూస్

భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ వాహనదారులకు ఓ కీలక అప్‌డేట్ ఇచ్చింది. పాత మోడల్ వాహనాల ఇంజిన్, పనితీరును దృష్టిలో ఉంచుకుని ఈ20 పెట్రోల్‌తో పాటు ఈ10 పెట్రోల్‌ను కూడా పెట్రోల్ బంకుల్లో అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించింది.

న్యూఢిల్లీ: పాత వాహనాలు కలిగిన వినియోగదారులు ఈ10 పెట్రోల్‌ను సులభంగా వాడేలా ఈ ఏర్పాటు చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇథనాల్ బ్లెండింగ్ ప్రాజెక్టును వేగవంతం చేస్తూ దేశవ్యాప్తంగా 20 శాతం ఇథనాల్ మిశ్రమంతో కూడిన ఈ20 పెట్రోల్ విక్రయాలను



# రక్తపు రోడ్లు

## ఏపీలోని చిలకలూరిపేటలో ఘోర ప్రమాదం

### ఆటోను ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు.. ఏడుగురు దుర్మరణం.. పలువురికి గాయాలు

ఏపీలోని పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు చిలకలూరిపేట అడ్డరోడ్డు దగ్గర ఆటోను ఢీ కొట్టింది.. ఈ ఘటనలో ఆటోలో ఉన్న ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. బంధువుల పుట్టినరోజు వేడుకకు కొండమంజులూరు వెళ్లి ఆటోలో వేలూరు తిరిగి వెళ్తుండగా ఈ ఘోరం జరిగింది.

చిలకలూరిపేట, ఆగస్టు 27 (ఈవార్తలు): చిలకలూరిపేట అడ్డరోడ్డు సెంటర్ దగ్గర ఈ ఘటన జరిగింది. విజయవాడ నుంచి తిరుపతి వెళ్తున్న ట్రావెల్స్ బస్సు ఆటోను ఢీ కొట్టడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. చనిపోయిన వారిలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఉన్నారు. మృతులను బొంతా బాబు (62), బొంతా మణెమ్మ (55), సంపూర్ణమ్మ (70), లక్ష్మమ్మ (75), గంగమ్మ (50), తరువాయి 2 వ పేజీలో...



## తుమ్మిడిహెట్టిపై 1న భేటీ

ప్రాణహిత నదిపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన తుమ్మిడిహెట్టి ఆనకట్ట నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక, అంతర్రాష్ట్ర అంశాలపై వచ్చే నెల ఒకటో తేదీన న్యూఢిల్లీలో కీలక సమావేశం జరగనుంది.

హైదరాబాద్, ఆగస్టు 27 (ఈవార్తలు): కేంద్ర జలసంఘం ఛైర్మన్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో తెలంగాణ నీటి పారుదల, మహారాష్ట్ర జల వనరుల శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారు. తుమ్మిడిహెట్టి ఆనకట్ట విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మే 26న తరువాయి 2 వ పేజీలో...

# అంజన్నకు గోస

## నిధులున్నా కొండగట్టు అభివృద్ధికి గ్రహణం.. పాలకుల చిన్నచూపుపై భక్తుల ఆవేదన

### రూ.35.19 కోట్ల టీటీడీ నిధులు సిద్ధం.. అయినా ముందుకు సాగని నిర్మాణాలు



కొండగట్టు అంజన్నకు గోస తప్పడం లేదా? భక్తుల కొంగుబంగారంగా కొలిచే కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి నిధులు సిద్ధంగా ఉన్నా.. పనులు మాత్రం అడుగు ముందుకు పడటం లేదు. శంకుస్థాపన జరిగి నెలలు గడుస్తున్నా నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంపై భక్తుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. ప్రముఖ పుణ్యక్షేత్రంగా కొండగట్టు ఖ్యాతి దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నా.. ఆలయ మౌలిక వసతుల విషయంలో మాత్రం పాలకుల నిర్లక్ష్యం కొనసాగుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మల్యాల/జగిత్యాల బ్యూరో/హైదరాబాద్, ఆగస్టు 27 (ఈవార్తలు): ప్రతి రోజు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులు కొండగట్టుకు తరలివస్తుంటారు. ప్రత్యేక పర్వదినాలు, హనుమాన్ దీక్షల సమయంలో భక్తుల రద్దీ మరింత పెరుగుతుంది. అంతటి ప్రాధాన్యం ఉన్న పుణ్యక్షేత్రానికి సరిపడా వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. అయితే కొండగట్టు అభివృద్ధి విషయంలో ఏ ప్రభుత్వం వచ్చినా ఆశించిన స్థాయిలో శ్రద్ధ చూపడం లేదనే ఆరోపణలు చాలాకాలంగా ఉన్నాయి. భక్తుల సంఖ్య పెరుగుతున్నా.. వారికి అవసరమైన వసతులు మాత్రం అదే స్థాయిలో పెరగడం లేదు. కొండగట్టు ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం 96 గదుల సత్రం, దీక్షా విరమణ మండపం నిర్మాణానికి రూ.35.19 కోట్ల తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిధులు సిద్ధంగా ఉన్నాయని జనసేన పార్టీ పేర్కొంది. నిధుల తరువాయి 2 వ పేజీలో...



## 288 మంది భారతీయులు గల్లంతు

### నేపాల్ వరదల్లో కనుమరుగు: విదేశాంగ శాఖ

పొరుగు దేశం నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదల కారణంగా 288 మంది భారతీయులు గల్లంతయ్యారని భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) గురువారం వెల్లడించింది. ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన విదేశాంగ శాఖ, సహాయక చర్యల నిమిత్తం నేపాల్ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటున్నట్లు తెలిపింది.

## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.16,298 |
| వెండి (కిలో): | రూ.2,65,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,658 |

## 59 కోట్లకు జన్‌ధన్ ఖాతాలు

### ఖాతాల్లో రూ.3.17 లక్షల కోట్ల డిపాజిట్లు

### 78 శాతం ఖాతాలు గ్రామీణ ప్రాంతాల్లో




న్యూఢిల్లీ: దేశంలో ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన (పీఎంజేడీవై) ఖాతాల సంఖ్య 59 కోట్లు దాటింది. ఈ ఖాతాల్లో మొత్తం రూ.3.17 లక్షల కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. 2014 ఆగస్టు 28న ప్రారంభమైన ఈ పథకం 12 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ వివరాలను వెల్లడించింది. జన్‌ధన్ ఖాతాల్లో 78 శాతం గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లోనే ఉన్నాయి. సుమారు 56 శాతం ఖాతాలు మహిళల పేరిట ఉన్నాయి. పేదలు, తరువాయి 2 వ పేజీలో...



## కేసీఆర్‌కు గుంటనక్క వెన్నుపోటు

### బీఆర్ఎస్‌ను హస్తగతం చేసుకునే కుట్ర
### మెదక్ ఎమ్మెల్యేలతో రహస్య మంతనాలు
### అటు గుంపుమేస్త్రీ, ఇటు బీజేపీతో దోస్తానా
### లండన్‌లో గుంటనక్క-గుంపు మేస్త్రీ లలూచీ
### అనుముల కాదు.. ఆంధ్రా రేవంత్ రెడ్డి
### టీఆర్ఎస్ చీఫ్ కవిత తీవ్ర ఆరోపణలు

హైదరాబాద్, ఆగస్టు 27 (ఈవార్తలు): బీఆర్ఎస్ ను హస్తగతం చేసుకునేందుకు గుంట నక్క (హరీశ్ రావు) తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాడని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత ఆరోపించారు. బంజారా హిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఎన్టీఆర్ కు చంద్రబాబు నాయుడు వెన్నుపోటు పొడిచిన మాదిరిగా కేసీఆర్ కు వెన్నుపోటు పొడిచేందుకు హరీశ్ రావు తెరవెనుక కుట్రలు చేస్తున్నాడని విమర్శించారు. మెదక్ ఎమ్మెల్యేలతో ఇటీవలే రహస్య మంతనాలు సాగించాడని... కేసీఆర్ వారసత్వం కేటీఆర్‌కు -2 వ పేజీలో...



## 389కి చేరిన మృతులు

### ఇంకా ఆచూకీ లేని 1,400 మంది

నేపాల్ వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 389కి చేరింది. ఇంకా 1,400 మంది ఆచూకీ ఇంకా లభించలేదని సమాచారం. వరదల్లో గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రెండు సైనిక విమానాలతో 48 టన్నుల ఆహార పదార్థాలు, నిత్యావసర వస్తువులను పంపినట్లు భారత ప్రభుత్వం వెల్లడించింది.

ఖట్మండు: వరద ముప్పు ఇంకా పూర్తిగా తొలగిపోలేదని నిపుణులు తీవ్ర హెచ్చరికలు జారీ చేస్తున్నారు. పర్వత ప్రాంతాల్లో అస్థిరంగా ఉన్న లోయలు, పాక్షికంగా విరిగిపడిన హిమానీనదం (గ్లేసియర్) కారణంగా రాబోయే రోజుల్లో మరోసారి భారీ స్థాయి వరదలు వచ్చే ప్రమాదం పొంచి ఉందని ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



మనిషి శరీరాన్ని నిరంతరం కాపాడే సహజ రక్షణ వ్యవస్థల్లో చర్మం ఒకటి. పాత కణాలను తొలగిస్తూ కొత్త కణాలను సృష్టించుకునే ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. ఈ సహజ ప్రక్రియను చర్మ కణాల పునరుత్పత్తి అంటారు. అయితే, సగటు మనిషి శరీరం నుంచి ప్రతి నిమిషానికి సుమారు 30 వేల నుంచి 40 వేల చర్మ కణాలురాలిపోతున్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ సహజ పునరుత్పత్తి వల్ల చర్మం సాగే గుణాన్ని, దృఢత్వాన్ని, స్థితిస్థాపకతను కాపాడుకుంటుందని పేర్కొన్నారు.

## తపాలా శాఖలో 25,000 పోస్టులు

### నోటిఫికేషన్ జారీ చేసిన పోస్టల్ డిపార్ట్‌మెంట్

న్యూఢిల్లీ: పదో తరగతి అర్హతతో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనుకునే నిరుద్యోగులకు భారత తపాలా శాఖ శుభవార్త చెప్పింది. దేశవ్యాప్తంగా వివిధ పోస్టల్ సర్కిళ్లలో ఖాళీగా ఉన్న 25,000కు పైగా గ్రామీణ డాక్ సేవక్ పోస్టుల భర్తీకి భారీ నోటిఫికేషన్ విడుదల చేసింది. బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్, తరువాయి 2 వ పేజీలో...





## మోదీ గ్రాఫ్ పడిపోతోంది!

### ఎన్నికలొస్తే 26 ఎంపీ సీట్లో పోతాయ్

### మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా రాజకీయాల్లో చాలా మార్పులు వస్తున్నాయి. కాక్రోచ్ జనతా పార్టీ ఢిల్లీలో నిర్వహించిన విద్యార్థుల ఉద్యమం తర్వాత ఎన్డీయేకు ఎదురుదెబ్బలు తరువాయి 2 వ పేజీలో...



## భూకంపం కాదు.. మంచుకొండ కూలినందుకే

### నేపాల్ విపత్తుపై ఇస్రో స్పష్టీకరణ

న్యూఢిల్లీ: నేపాల్‌లోని రసువా సరిహద్దు ప్రాంతాన్ని ముంచెత్తిన విధ్వంసకర ఆకస్మిక వరదలకు (ఫ్లాష్ ఫ్లడ్స్) అసలు కారణమేంటో ఉపగ్రహ ఆధారిత అధ్యయనాల ద్వారా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఈ శోకసంద్రానికి కారణం భూకంపం కాదని, హిమాలయాల్లో నిటారుగా ఉన్న 'గ్లేసియర్' (మంచు కొండ) ఒక్కసారిగా తరువాయి 2 వ పేజీలో...

# లో బీమ్‌లోనే లైట్లు!

**మొదటి పేజీ తరువాయి**

హెడ్‌ల్యాంప్ ఆన్ (ఏహెచ్‌ఓ) వ్యవస్థ పనిచేసే సమయంలో హెడ్‌ల్యాంప్ తప్పనిసరిగా లో బీమ్‌లోనే ఉండాలి. ప్రస్తుతం ఏహెచ్‌ఓ వ్యవస్థ వాహనం అమరికను బట్టి లో బీమ్ లేదా హై బీమ్‌లో హెడ్‌ల్యాంప్‌ను వెలిగించే అవకాశం ఉంది. రాత్రి వేళ అధిక కాంతితో ఎదురుగా వచ్చే వాహనదారుల కళ్లకు ఇబ్బంది కలగకుండా, రహదారిపై ఇతరులకు స్పష్టమైన దృష్టి ఉండేలా ఈ మార్పును ప్రతిపాదించినట్లు మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఆటోమేటిక్ వ్యవస్థ పనిచేస్తున్నప్పుడు హెడ్‌ల్యాంప్ లో బీమ్‌లోనే ఉండటం వల్ల ఎదురుగా వచ్చే వాహనదారులను తీవ్ర కాంతి ప్రభావానికి గురిచేసే అవకాశం తగ్గుతుంది. ద్విచక్ర వాహనాల అధిక తీవ్రత కలిగిన హెడ్‌ల్యాంప్‌లకు సంబంధించి కూడా నిబంధనలను కఠినతరం చేయాలని కేంద్రం ప్రతిపాదించింది. ప్రస్తుతం ద్విచక్ర వాహనాలకు అనుమతిస్తున్న గరిష్ఠ కాంతి తీవ్రత 1.5 లక్షల క్యాండెలా ఉండగా, దాన్ని 1 లక్ష క్యాండెలాకు తగ్గించాలని ముసాయిదాలో పేర్కొన్నారు. అదేవిధంగా కార్లు వంటి 4 చక్రాల వాహనాల హెడ్‌ల్యాంప్‌ల గరిష్ఠ కాంతి తీవ్రతను 2.25 లక్షల క్యాండెలా నుంచి 1.5 లక్షల క్యాండెలాకు తగ్గించాలని ప్రతిపాదించారు. రోడ్లపై అధిక కాంతి కారణంగా ఏర్పడే చూపు సమస్యలు, ప్రమాదాల ముప్పును తగ్గించడంతో పాటు రాత్రివేళ ప్రయాణించే వాహనదారులకు మెరుగైన దృశ్యమానత కల్పించడమే ఈ ప్రతిపాదిత మార్పుల ప్రధాన ఉద్దేశంగా కేంద్రం భావిస్తోంది.

# బంకుల్లో ఈ-10 పెట్రోల్!

**మొదటి పేజీ తరువాయి**

విస్తృతంగా అందుబాటులోకి తెచ్చింది. అయితే, ఈ20 కంప్లైయన్స్ లేని పాత వాహనాల్లో ఆ ఇంధనాన్ని వాడటం వల్ల ఇంజిన్ భాగాలు, రబ్బర్ హౌస్‌లు దెబ్బతినే అవకాశం ఉందంటూ వాహనదారుల నుంచి ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకున్న బీపీసీఎల్, పాత వాహనదారులకు ప్రత్యామ్నాయంగా ఈ10 పెట్రోల్‌ను అందుబాటులోకి తీసుకురావాలనుకుంటోంది. కొత్తగా మార్కెట్లోకి వస్తున్న వాహనాలు ఈ20 ఇంధనానికి అనుగుణంగా తయారవుతున్నప్పటికీ, ప్రస్తుతం రోడ్లపై ఉన్న లక్షలాది పాత వాహనాలు దెబ్బతినకుండా ఉండేందుకు ఈ10 పెట్రోల్ విక్రయాలను కొనసాగించడం అత్యవసరమని కంపెనీ భావిస్తోంది. పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలను చేరుకుంటూనే, వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా రెండు రకాల పెట్రోల్ ఆప్షన్లను అందుబాటులో ఉంచే దిశగా బీపీసీఎల్ అడుగులు వేస్తోంది.

# తుమ్మిడిహెట్టిపై 1న భేటీ

**మొదటి పేజీ తరువాయి**

మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు లేఖ రాసి, రెండు రాష్ట్రాల మధ్య సమావేశం ఏర్పాటు చేసి పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం సూచించాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి కూడా ఈ అంశాన్ని సీఎం తీసుకెళ్లారు. ఆ లేఖను ప్రధానమంత్రి కార్యాలయం జలశక్తి మంత్రిత్వ శాఖకు పంపించింది. అనంతరం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు కూడా ఆగష్టు ఐదో తేదీన లేఖ రాసిన ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని కోరారు. తుమ్మిడిహెట్టి ఆనకట్టపై రెండు రాష్ట్రాలతో సంప్రదింపులు జరపాలని కేంద్ర జలసంఘం ఛైర్మన్‌కు కేంద్ర జలశక్తి శాఖ ఆదేశించింది. అందుకు అనుగుణంగా సెప్టెంబర్ ఒకటో తేదీన ఢిల్లీలోని సేవా భవన్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. 148 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి మహారాష్ట్రతో గతంలో ఒప్పందం కుదిరింది. అయితే 152 మీటర్ల ఎత్తు ఉండేలా అంగీకారం సాధించేందుకు రాష్ట్రం ప్రయత్నిస్తోంది. 148 మీటర్ల వద్ద అవసరమైన నీటిని గ్రావిటీ ద్వారా తీసుకోవడం సాధ్యం కాదని, భారీ పంపులు వినియోగిస్తే విద్యుత్ వ్యయం పెరుగుతుందని కేంద్రానికి వివరించింది. తక్కువ విద్యుత్ వ్యయంతో, దీర్ఘకాలికంగా రాష్ట్రానికి ప్రయోజనం కలిగేలా ప్రాజెక్టును నిర్మించాలని భావిస్తున్నట్లు పేర్కొంది. సీడబ్ల్యూపీఆర్ఎస్ అధ్యయనాల ప్రకారం నీటి లభ్యత పెరగడంతో పాటు అదనంగా అయ్యే ముంపు కూడా పరిమితంగానే ఉంటుందని తెలంగాణ ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. వచ్చే నెల ఒకటో తేదీన జరగనున్న సమావేశంలో ఆనకట్ట నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక, అంతర్రాష్ట్ర, ముంపు సంబంధిత అంశాలపై చర్చ జరగనుంది.

# తపాలా శాఖలో 25,000 పోస్టులు

**మొదటి పేజీ తరువాయి**

డాక్ సేవక్ విభాగాల్లో ఈ నియామకాలు చేపట్టనున్నారు. ఈ ఉద్యోగాలకు ఎటువంటి రాత పరీక్ష గానీ, ఇంటర్వ్యూ గానీ లేకుండా కేవలం పదో తరగతి మార్కుల మెరిట్ ఆధారంగా ఎంపిక చేయనుండటం విశేషం. ఈ నోటిఫికేషన్ ద్వారా దేశవ్యాప్తంగా 25,000కు పైగా పోస్టులను భర్తీ చేయనుండగా, అందులో ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 918, తెలంగాణలో 419 పోస్టులు ఉన్నట్లు సమాచారం. అయితే, తుది ఖాళీల వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్‌లోని నోటిఫికేషన్ చూడాలని అధికారులు సూచిస్తున్నారు.

**వన్-టైమ్ రిజిస్ట్రేషన్ ప్రారంభం: 2026 ఆగస్టు 31**

రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: 2026 సెప్టెంబర్ 19 (సాయంత్రం 5 గంటల వరకు)

ఆన్‌లైన్ దరఖాస్తు, ఫీజు చెల్లింపు: 2026 సెప్టెంబర్ 2 నుంచి 2026 సెప్టెంబర్ 21(సాయంత్రం 5 గంటల వరకు

దరఖాస్తుల సవరణకు అవకాశం: సెప్టెంబర్ 23, 24 తేదీల్లో

**అర్హతలు, వయోపరిమితి:**

గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదో తరగతి (సెకండరీ స్కూల్ ఎగ్జామినేషన్) ఉత్తీర్ణులైన వారు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. గణితం, ఇంగ్లీష్ సబ్జెక్టులలో తప్పనిసరిగా పాసై ఉండాలి. అలాగే, దరఖాస్తు చేసే సర్కిల్‌కు సంబంధించిన స్థానిక భాషలో ప్రావీణ్యం ఉండాలి. అభ్యర్థుల వయసు దరఖాస్తు చివరి తేదీ నాటికి 18 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 5 ఏళ్లు, ఓబీసీ అభ్యర్థులకు 3 ఏళ్లు, దివ్యాంగులకు వయోపరిమితిలో సడలింపులు ఉంటాయి. బేసిక్ కంప్యూటర్ పరిజ్ఞానం, సైకిల్ తొక్కడం వచ్చి ఉండటం అదనపు అర్హతగా పరిగణిస్తారు.

# రక్తపు రోడ్లు

**మొదటి పేజీ తరువాయి**

చౌటుపల్లి సువార్త (45), మరియమ్మ (45)లుగా గుర్తించారు. మరో ఇద్దరి పరిస్థితి కూడా విషమంగా ఉందని గుంటూరు జీజీహెచ్ వైద్యులు తెలిపారు. గాయపడిన వారిలో నలుగురు చిన్నారులు ఉన్నారు. తెలుగు రాష్ట్రాల్లో 24 గంటల వ్యవధిలో ఇది రెండో ప్రమాదం. బుధవారం ఉదయం తెలంగాణలోని సూర్యాపేట జిల్లా కోదాడ దగ్గర హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిలో డివైడర్‌ను ఢీకొట్టి ఆగిన లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టిన ఘటనలో ఆరుగురు మృతిచెందిన విషయం తెలిసిందే.

# అంజన్నకు గోస



**మొదటి పేజీ తరువాయి**

కొరత లేకపోయినా నిర్మాణ పనులు ఎందుకు ప్రారంభం కాలేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఇక్కడే భక్తులకు ప్రధాన ప్రశ్న ఎదురవుతోంది. డబ్బులు సిద్ధంగా ఉన్నప్పుడు.. భక్తుల కోసం ఉద్దేశించిన నిర్మాణాలు చేపట్టేందుకు ఇంకా ఎందుకు జాప్యం? టెండర్ ప్రక్రియ ఎందుకు ముందుకు సాగడం లేదు? ప్రభుత్వ యంత్రాంగంలో ఎక్కడ అడ్డంకి ఏర్పడింది? అన్నదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

**పవన్ శంకుస్థాపన చేసినా..**

ఈ ఏడాది జనవరి 3న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కొండగట్టులో పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన విషయాన్ని జనసేన గుర్తుచేసింది. టీటీడీ నిధులు సమకూర్చడంలో పవన్ కల్యాణ్ చొరవ చూపారని ఆ పార్టీ పేర్కొంది. అయితే శంకుస్థాపన జరిగి నెలలు గడిచినా పనులు ప్రారంభం కాకపోవడంపై జనసేన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. నిధులు అందుబాటులో ఉన్నప్పుడు టెండర్ ప్రక్రియను పూర్తి చేసి నిర్మాణ పనులు ఎందుకు మొదలుపెట్టలేదో ప్రభుత్వం ప్రజలకు వివరించాలని డిమాండ్ చేసింది.

**ఆలయం ఏళ్లుగా ఎదురుచూపుల్లోనే..**

కొండగట్టు అభివృద్ధి విషయంలో ఇదేమీ కొత్త పరిణామం కాదనే అభిప్రాయం భక్తుల్లో ఉంది. కొండగట్టును అభివృద్ధి చేస్తామని గత ప్రభుత్వాలు అనేక సందర్భాల్లో హామీలు ఇచ్చాయి. మాస్టర్‌ప్లాన్, మౌలిక వసతులు, భక్తులకు వసతి, పార్కింగ్, దీక్షా విరమణకు అవసరమైన సౌకర్యాలు వంటి అంశాలు తరచూ చర్చకు వచ్చాయి. ప్రకటనలు వచ్చినంత వేగంగా పనులు మాత్రం ముందుకు సాగలేదనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం మారినా కొండగట్టు పరిస్థితుల్లో ఆశించిన మార్పు కనిపించడం లేదని భక్తులు అంటున్నారు. కోట్లాది రూపాయల అభివృద్ధి హామీలు, శంకుస్థాపనలు, ప్రతిపాదనలు.. ఇవన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయన్న ఆవేదన వ్యక్తమవుతోంది. కాగా, కొండగట్టు అభివృద్ధి పనులపై మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఎందుకు స్పందించడం లేదని జనసేన ప్రశ్నించింది. నియోజకవర్గానికి, రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రానికి సంబంధించిన అంశంపై ప్రభుత్వం స్పష్టమైన సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేసింది. నిధులు ఎక్కడ ఉన్నాయి? టెండర్ ప్రక్రియ ఏ దశలో ఉంది? పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు? పూర్తయ్యే గడువు ఎంత? అనే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని జనసేన పేర్కొంది.

**రాజకీయ రగడ**

పవన్ కల్యాణ్, మంత్రి పొన్నం ప్రభాకర్ మధ్య గతంలో చోటుచేసుకున్న రాజకీయ మాటల యుద్ధం నేపథ్యంలో కొండగట్టు అభివృద్ధిపై జనసేన చేసిన తాజా విమర్శలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పవన్ కల్యాణ్ సభకు అనుమతి విషయంలో ఇరువురి మధ్య మాటల తూటాలు పేలాయి. అప్పటి నుంచి ఇరువైపులా రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కొండగట్టు అభివృద్ధి అంశం మరోసారి రాజకీయ చర్చకు దారితీస్తోంది. అయితే భక్తుల వాదన మాత్రం ఒక్కటే.. అంజన్న ఆలయ అభివృద్ధిని రాజకీయాలకు అతీతంగా చూడాలి. కొండగట్టుకు వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించడం ఎవరి రాజకీయ విజయమో, ఎవరి ఓటమో కాదు. అది భక్తుల హక్కు. ఆలయ అభివృద్ధికి నిధులు సిద్ధంగా ఉన్నప్పుడు వాటిని సద్వినియోగం చేసి పనులను వేగంగా పూర్తి చేయడం ప్రభుత్వ బాధ్యత అని భక్తులు పేర్కొంటున్నారు. అంజన్నను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు గంటల తరబడి ఇబ్బందులు, వసతి కోసం అవస్థలు, దీక్షా విరమణ సమయంలో సౌకర్యాల కొరత ఉండకూడదన్నదే వారి ఆకాంక్ష. కోట్ల రూపాయల నిధులు సిద్ధంగా ఉండి కూడా పనులు ప్రారంభం కాకపోతే.. ఆ నిధుల ప్రయోజనం ఎవరికి? భక్తుల కోర్కెలు తీర్చే అంజన్న.. తన ఆలయ అభివృద్ధి కోసం మాత్రం పాలకుల దయ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి రావడం ఎంతవరకు సమంజసం? ప్రభుత్వం ఇకనైనా మొద్దు నిద్ర వీడుతుందా? లేక మరో హామీతో కొండగట్టు కొండపై మరోసారి రాజకీయ మబ్బులే కమ్ముకుంటాయా? అన్నది చూడాలి.

# కేసీఆర్‌కు గుంటనక్క వెన్నుపోటు

**మొదటి పేజీ తరువాయి**




రావద్దని వారితో అన్నాడని చెప్పారు. అటు బీజేపీతోనూ, ఇటు గుంపు మేస్త్రీ తోనూ హరీశ్ రావుకు లాలూచీ ఉందన్నారు. ఇక రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెట్టి ఆంధ్రా ఏజెంట్ గా మారడని విమర్శించారు. ఇకనైనా రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజల బాగు కోసం పనిచేయకుంటే ఊరుకోమని హెచ్చరించారు. చేరదీసి రాజకీయ భిక్ష పెట్టిన కేసీఆర్ కు వెన్నుపోటు పొడిచేందుకు హరీశ్ రావు సిద్ధమయ్యాడని కల్వకుంట్ల కవిత ఆరోపించారు. తిన్నింటి వాసాలు లెక్కపెడుతూ బీఆర్ఎస్ ను హస్తగతం చేసుకోవాలని కుట్ర చేస్తున్నాడన్నారు. తాను ఏదీ ఆధారాలు లేకుండా మాట్లాడనని...ఇటీవలే మెదక్ జిల్లా ఎమ్మెల్యేలలతో హరీశ్ రహస్య మంతనాలు నిర్వహించాడని కవిత చెప్పారు. ఆ సమావేశంలో ఉన్న ఎమ్మెల్యే ఒకరు తనకు ఈ విషయాలు చెప్పారన్నారు. ఎన్టీఆర్ మాదిరిగానే కేసీఆర్ గొప్ప వ్యక్తి అని కానీ కేసీఆర్ వారసత్వం కేటీఆర్ కు రావద్దని ఆ మీటింగ్ లో హరీశ్ రావు కామెంట్లు చేశారని చెప్పారు. బీఆర్ఎస్ ను హస్తగతం చేసుకునేందుకు అటు గుంపు మేస్త్రీతో ఇటు బీజేపీ తో దోస్తానా చేస్తున్నాడన్నారు. బీజేపీ తో హరీశ్ రావు దోస్తీకి సంబంధించి తన వద్ద ఆధారాలున్నాయన్నారు. రాజ్ పుష్ప స్కైవాక్ ఓపెన్ విల్లాస్ లో బీజేపీ ముఖ్యనేతతో హరీశ్ రావు తరచూ సమావేశం అవుతున్నారన్నారు. పాలల్లో పసుపు, మిరియాలు వేసుకోని తాగే ఆ నేత గురించి గూగుల్ చేస్తే తెలిసిపోతుందన్నారు. ఆయనతో మీటింగ్ ఉన్న రోజు హరీశ్ రావు అన్ని కార్యక్రమాలను రద్దు చేసుకుంటున్నాడని చెప్పారు. ఇప్పుడు తాను బీఆర్ఎస్ లో లేనని ఆ పార్టీ ఎటు పోయిన సరే తనకు సంబంధం లేదని కవిత అన్నారు. కానీ తిన్నింటి వాసాలు లెక్కపెడుతున్న గుంటనక్క గురించి ప్రజలకు తెలియాలనే ఈ విషయం బయటకు చెబుతున్నానన్నారు.

**లండన్‌లో గుంటనక్క, గుంపు మేస్త్రీ లాలూచీ**

బీజేపీ తో మాత్రమే కాకుండా గుంపు మేస్త్రీతోనూ ఈ గుంటనక్కకు లాలూచీ ఉందన్నారు. ఇటీవలే వీళ్లు లండన్ లో రహస్యంగా సమావేశమై అగ్రిమెంట్ చేసుకోని లాలూచీ పడ్డారని కవిత చెప్పారు. ఒకవేళ గుంటనక్కతో గుంపు మేస్త్రీకి ఎలాంటి లాలూచీ లేకపోతే ఆయన్ను క్విడ్ ప్రో కో కింద అరెస్ట్ చేయాలని కవిత డిమాండ్ చేశారు. హరీశ్ రావు హెల్త్ మినిస్టర్ గా ఉన్న సమయంలో నారాయణ, చైతన్య కాలేజ్ లకు నెలకు రూ. 5 కోట్ల పాలు పోశారన్నారు. 8 ఏళ్ల పాటు ఆ రెండు సంస్థల ద్వారా 960 కోట్లు దండుకున్నారన్నారు. అంతేకాకుండా కామినేని, యశోద, కిమ్స్ లాంటి కార్పొరేట్ హాస్పిటల్స్ కు కూడా పాలు సరఫరా చేశారన్నారు. ఇదంతా క్విడ్ ప్రో కో కిందకు రాదా అని కవిత ప్రశ్నించారు. గతంలో ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం అంశంలో హరీశ్ పేరు ఎత్తిన ముఖ్యమంత్రి ఇప్పుడు ఎందుకు సైలెంట్ అయ్యారో చెప్పాలని డిమాండ్ చేశారు. కచ్చితంగా వీరి మధ్య లండన్ లో లలూచీ అయ్యిందన్నారు. ఆ లాలూచీ కి సంబంధించిన వివరాలను టీఆర్ఎస్ తరఫున ఒక్కొక్కటిగా బయటపెడతానని కవిత చెప్పారు.

**ఆంధ్రావాళ్ల చేతిలో రేవంత్ రెడ్డి బందీ**

అటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రావాళ్ల చేతిలో బందీ అయ్యారని కవిత మండిపడ్డారు. తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతూ ఆంధ్రా ఏజెంట్ గా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రహ్మణ పరిషత్ కు ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ను ఆంధ్రావాళ్లను నియమించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రహ్మణ పరిషత్ ఛైర్మన్ గా ఉన్న బసవరాజు శ్రీనివాస రాజు అనే వ్యక్తి పచ్చి తెలంగాణ వ్యతిరేకి అన్నారు. తెలంగాణను ఉద్యమ సమయంలో రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన వ్యక్తికి ఆ పదవి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. తెలంగాణ బ్రహ్మణులలో అర్హులు లేరా అని ప్రశ్నించారు. తెలంగాణ వాదులను, దళితులను ఇష్టానుసారంగా తిట్టిన వ్యక్తికి బ్రహ్మణ పరిషత్ ఛైర్మన్ పదవి ఇచ్చి దాన్ని రౌడీలకు అడ్డాగా మార్చారని మండిపడ్డారు. అటు యాదగిరి గుట్ట బోర్డు మెంబర్లలో ఆంధ్రా హీరో భార్యకు పదవి కట్టబెట్టారని విమర్శించారు. తెలంగాణ వాళ్ల పైసలతో కట్టిన గుడిలో ఆంధ్రావాళ్లకు పెత్తనం ఎలా ఇస్తారన్నారు. జనసేనకు చెందిన ఓ ఎంపీ కుమారుడు 6 కోట్ల కారు వేసుకోని ఒడిశాకు చెందిన 25 ఏళ్ల అమ్మాయిని గుద్ది చంపితే ముఖ్యమంత్రి పట్టించుకోలేదని కవిత గుర్తు చేశారు. ఆతని మీద నమోదు చేసిన ఎఫ్ఐఆర్ లో తండ్రి పేరు లేదని, అందులో ఎన్నో కాలమ్ లు ఖాళీగా పెట్టారని మండిపడ్డారు. వేరే కేసులలో కూడా ఇదే విధంగా ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారా అంటూ ప్రభుత్వాన్ని, డీజీపీని ప్రశ్నించారు. ఇలాంటి డొల్ల ఎఫ్ఐఆర్ ను నమోదు చేసినందుకు పోలీసులు సిగ్గుపడాలని కవిత వ్యాఖ్యనించారు. అదే భోదన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు ప్రగతి భవన్ బారికేడ్లను గుద్దితేనే అతని జీవితాన్ని ఆగం చేశారని గుర్తు చేశారు. తెలంగాణకు చెందిన మైనార్టీ నాయకుని కుమారుడైనందుకే అలా చేశారన్నారు. కానీ ఆంధ్రా నాయకుల కొడుకు యాక్సిడెంట్ చేస్తే పట్టించుకోరా అని నిలదీశారు.

**అంతటా ఆంధ్రా పెత్తనమే**

రెడ్ కో ఛైర్మన్ గా, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ గా అటు ఎలక్ట్రిసిటీ, ఇరిగేషన్ డిపార్ట్ మెంట్ లలో కూడా ఆంధ్రా పెత్తనమే ఉందన్నారు. బయోకాన్ లో తెలుగు మాట్లాడినందుకు 2 వందల మందిని తీసేస్తే ఈ ముఖ్యమంత్రి మాట్లాడడని కవిత అన్నారు. తెలంగాణ జలాలు ఆంధ్రా నాయకుల దోచుకుంటే కూడా ముఖ్యమంత్రికి సోయి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికీ కూడా కాంట్రాక్టులన్నీ ఆంధ్రా వాళ్లకే ఇస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రా ఏజెంట్ గా మారారన్నారు. తెలంగాణ ఇందుకోసమే తెచ్చుకున్నామా అని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల సీఎం అమెరికా టూర్ కు కేంద్రం పర్మిషన్ ఇవ్వకపోతే ఆయనకు తెలంగాణ గుర్తుకు వచ్చిందన్నారు. కానీ తెలంగాణకు ఇన్ని నష్టాలు జరుగుతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నిజంగా ముఖ్యమంత్రికి చిత్తశుద్ది ఉంటే వెంటనే బ్రహ్మణ పరిషత్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు గా తెలంగాణ వారిని నియమించాలన్నారు. అదే విధంగా తెలంగాణ ప్రయోజనాల కోసం రేవంత్ రెడ్డి పనిచేయాలని సూచించారు.

**బీఆర్ఎస్ వ్యవస్థీకృత నేరాలు**

కాంగ్రెస్ పార్టీ అరాచకాలను ప్రశ్నించాల్సిన బీఆర్ఎస్ పూర్తిగా కాంప్రమైజ్ అయ్యిందని కవిత అన్నారు. పాల వ్యాపారం కోసం హరీశ్ రావు, ఆంధ్రా దోస్తులు, రియల్ ఎస్టేట్ బిజినెస్ కోసం కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించటం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఫెయిల్ అయ్యిందని ఇక తామే అధికారంలోకి వస్తామని బీఆర్ఎస్ అంటోందని కవిత చెప్పారు. కానీ అధికారంలో ఉండగా బీఆర్ఎస్ వ్యవస్థీకృత నేరాలకు పాల్పడిందని కవిత చెప్పారు. ఇరిగేషన్, పాలు వ్యాపారం ఒకరు, రియల్ ఎస్టేట్ ఒకరు, ఇసుక దందాను ఒకరు పంచుకున్నారన్నారు. నేరాలను వ్యవస్థీకృతంగా చేసిన బీఆర్ఎస్ కు మళ్లీ అవకాశం ఇద్దామా అంటూ ప్రశ్నించారు. ఆ రెండు పార్టీలు ప్రజలను మోసం చేశాయని చెప్పారు. పారదర్శకమైన, అవినీతి లేని, కొత్తవాళ్లకు అవకాశం ఇచ్చేందుకు తాము వచ్చామని కవిత చెప్పారు. తమ పార్టీకి అవకాశం ఇస్తే తెలంగాణ ప్రయోజనాల కోసం పనిచేస్తామని చెప్పారు.

# భూకంపం కాదు.. మంచుకొండ కూలినందుకే

**మొదటి పేజీ తరువాయి**

కూలిపోవడమేనని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. భారత కాలమానం ప్రకారం శాటిలైట్ డేటాను విశ్లేషించిన ఇస్రోకు చెందిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్.. ప్రమాదానికి ముందు, ఆ తర్వాత ఇస్రో 'రిసోర్స్‌శాట్-2ఏ' మరియు 'సెంటినెల్-2' ఉపగ్రహాలు తీసిన చిత్రాలను పోల్చి చూసి ఈ నిజాలను బయటపెట్టింది. టిబెట్-నేపాల్ సరిహద్దుకు ఎగువన ఉన్న హిమానీనదం సుమారు మూడింట రెండు వంతులు ఒక్కసారిగా విరిగిపడటంతో తీవ్రమైన 'ఐస్-రాక్ అవలాంచ్' కిందకు దూసుకొచ్చింది. ఇలా విరిగిపడిన మంచు, రాళ్లు 'లేందే' నది ప్రవాహాన్ని తాత్కాలికంగా అడ్డుకోవడంతో అక్కడ అకస్మాత్తుగా నీరు నిలిచిపోయి భారీ కృత్రిమ సరస్సులా మారింది. ఆ తర్వాత ప్రవాహ ఒత్తిడికి తాత్కాలికంగా ఏర్పడిన అడ్డంకి ఒక్కసారిగా బద్దలవడంతో భారీ ఎత్తున మట్టి, రాళ్లు, వరద నీరు ఊహించని వేగంతో లేందే, భోటేకోశి నదుల్లోకి ఉప్పెనలా ఎగసిపడ్డాయి. ఈ సంఘటనను మొదట్లో 4.4 లేదా 4.9 తీవ్రతతో కూడిన భూకంపంగా భావించినప్పటికీ, యుఎస్ జియోలాజికల్ సర్వే, ఇస్రో శాస్త్రవేత్తలు అసలు నిజం వెల్లడించారు. అసలు భూకంపమే రాలేదని, వేల టన్నుల మంచు పర్వతం ఒక్కసారిగా విరిగి కింద పడిన తీవ్రత వల్లే భూమిలో 5.2 తీవ్రతకు సమానమైన ప్రకంపనలు నమోదయ్యాయని వివరించారు. ఈ ఘటనతో భోటేకోశి నదిలో ప్రవాహం అపారంగా పెరిగి చుట్టుపక్కల గ్రామాలు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులను ముంచెత్తింది. ఇప్పటివరకు ఈ ఘోర విపత్తులో 160 మందికి పైగా మరణించగా, వందలాది మంది గల్లంతయ్యారు. ప్రకృతి విపత్తుల తీరును అర్థం చేసుకోవడంలో అంతరిక్ష సాంకేతికత ఎంత కీలకంగా మారిందో ఈ ఇస్రో ఉపగ్రహ విశ్లేషణ మరొకసారి రుజువు చేసింది.

# మోదీ గ్రాఫ్ పడిపోతోంది!

**మొదటి పేజీ తరువాయి**

తగిలాయి. ఢిల్లీలో ఆందోళనల మీద పార్లమెంట్ కు వచ్చి ప్రకటన చేయలేని స్థితికి ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా వెళ్లిపోయారు. దీనికి బదులుగా రోజూ విపక్షాలు పార్లమెంట్ ను స్తంభింపజేస్తున్నా పట్టించుకోకుండా అలాగే ఉండిపోయారు. ఈ నేపథ్యంలో దేశంలో ఓటర్ల నాడి ఎలా ఉందో తెలుసుకునేందుకు ఇండియా టుడే ఎప్పటిలాగే మూడ్ ఆఫ్ ద నేషన్ సర్వే నిర్వహించింది. దేశంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఎన్డీయే, ఇండియా కూటముల్లో ఎవరు గెలుస్తారు, లోక్ సభలో ఎవరికి ఆధిక్యం లభిస్తుందన్న అంశంపై ఇండియా టుడే నిర్వహించిన ఈ సర్వేలో షాకింగ్ ఫలితాలు వచ్చాయి. ఇప్పుడు లోక్ సభ ఎన్నికలు జరిగితే తిరిగి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే అధికారం నిలబెట్టుకుంటుందని ఇందులో తేలింది. కానీ ఈ ఏడాది జనవరిలో మూడ్ ఆఫ్ ద నేషన్ సర్వే నిర్వహించే నాటికి ఉన్న 352 సీట్ల అంచనా నుంచి 326 సీట్లకు పడిపోతుందని తేలింది. అంటే 26 ఎంపీ సీట్లను ఎన్డీయే కోల్పోతుందన్న మాట. కాక్రోచ్ ఉద్యమం తర్వాత నిర్వహించిన ఈ సర్వేలో ఎన్డీయేకు ఓటర్ల ఆదరణ దాదాపుగా చెక్కుచెదరలేదని అర్థమవుతోంది. మరోవైపు విపక్ష ఇండియా కూటమికి ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే 185 సీట్లు వస్తాయని మూడ్ ఆఫ్ ద నేషన్ సర్వే అంచనా వేసింది. ఈ ఏడాది జనవరిలో 182 సీట్లు వస్తాయని అంచనా వేశారు. ఈ లెక్కన చూస్తే గత లోక్ సభ ఎన్నికల్లో ఇండియా కూటమి సాధించిన 234 సీట్లతో పోలిస్తే ఈ రెండూ తక్కువే కావడం విశేషం. ఈ ఏడాది జూలై 1, ఆగస్టు 25 మధ్య మొత్తం 25,184 మందిపై ఈ సర్వే నిర్వహించినట్లు ఇండియా టుడే తెలిపింది.

# 389కి చేరిన మృతులు

**మొదటి పేజీ తరువాయి**

ఇంటిగ్రేటెడ్ మౌంటైన్ డెవలప్‌మెంట్ శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. టిబెట్ సరిహద్దుల్లోని గ్యాంగ్‌భు గ్లేసియర్ వద్ద ఏర్పడిన పగుళ్ల వల్ల ప్రధానమైన ముప్పు పొంచి ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. భూకంపం లేదా ప్రకంపనలు వస్తే మిగిలిన గ్లేసియర్ భాగం కూడా విరిగి లోయలో పడిపోయే అవకాశం ఉంది. అదే జరిగితే వరద ఉధృతి మళ్లీ విరుచుకుపడుతుంది. మరోవైపు రసువాగఢి సరిహద్దుకు ఎగువన లెండె నది ప్రవాహం ఆగిపోవడంతో అక్కడ పెద్ద సరస్సు ఏర్పడింది. ఈ సరస్సు కట్టలు తెగితే కింది ప్రాంతాలకు భారీ ముప్పు వాటిల్లుతుంది.

# 288 మంది భారతీయులు గల్లంతు

**నేపాల్ వరదల్లో కనుమరుగు: విదేశాంగ శాఖ**

న్యూఢిల్లీ: పొరుగు దేశం నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదల కారణంగా 288 మంది భారతీయులు గల్లంతయ్యారని భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) గురువారం వెల్లడించింది. ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన విదేశాంగ శాఖ, సహాయక చర్యల నిమిత్తం నేపాల్ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటున్నట్లు తెలిపింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఇప్పటివరకు 21 మంది భారతీయులను సురక్షితంగా రక్షించినట్లు తెలిపారు. బాధితులంతా తమిళనాడుకు చెందిన వారని ఆయన స్పష్టం చేశారు. గల్లంతైన వారి ఆచూకీ కనిపెట్టేందుకు నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయం స్థానిక అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని ఆయన వివరించారు. ఇదిలా ఉండగా, టిబెట్‌లో చిక్కుకున్న సుమారు 200 మంది భారతీయులు సైతం సహాయం కోసం విజ్ఞప్తి చేసినట్లు జైస్వాల్ వెల్లడించారు. వారిని సురక్షితంగా తరలించేందుకు అవసరమైన ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

# 59 కోట్లకు జన్‌ధన్ ఖాతాలు

**మొదటి పేజీ తరువాయి**

మారుమూల ప్రాంతాల ప్రజలను బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. 2026 ఆగస్టు 19 నాటికి ఒక్కో ఖాతాలో సగటున రూ.5,356 ఉన్నాయి. గత 12 ఏళ్లలో ఒక్కో ఖాతాకు సగటు డిపాజిట్ 3.4 రెట్లు పెరిగింది. ఖాతాలను ప్రజలు ఎక్కువగా వినియోగిస్తున్నారని, పొదుపు అలవాటు పెరిగిందని ఇది సూచిస్తోందని ఆర్థిక శాఖ తెలిపింది. జన్‌ధన్ ఖాతాదారులకు ఉచిత రూపే డెబిట్ కార్డు లభిస్తుంది. దీనితో రూ.2 లక్షల ప్రమాద బీమా ఉంటుంది. అత్యవసర సమయంలో రూ.10 వేల వరకు ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయం కూడా ఉంది. జన్‌ధన్-ఆధార్-మొబైల్ (జేఏఎం) వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరుతోంది. మధ్యవర్తులు, జాప్యానికి అవకాశం లేకుండా సాయం అందుతోందని కేంద్రం తెలిపింది.

## ఐఫోన్ కొనివ్వలేదని
# బాలిక ఆత్మహత్య

విశాఖపట్నం, ఆగస్టు 27 (ఈవార్తలు): ఐఫోన్ కొనివ్వలేదనే మనస్తాపంతో 15 ఏళ్ల బాలిక ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన విశాఖపట్నం కంచరపాలెంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, భర్త వదిలివెళ్లినప్పటి నుంచి ఓ మహిళ కూలి పనులు చేస్తూ ఒంటరిగా తన కుమార్తె, కుమారుడిని పోషిస్తోంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా బాలిక 9వ తరగతిలోనే చదువు మానేసింది. కాగా, గత రెండు రోజులుగా తనకు ఐఫోన్ కొనివ్వాలని తల్లిని బాలిక పట్టుబడుతూ వస్తోంది. ఈ విషయంపై ఇద్దరి మధ్య పలుమార్లు గొడవ జరిగినట్లు సమాచారం. కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న తాను ఐఫోన్ కొనివ్వలేనని తల్లి చెప్పడంతో బాలిక తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలో ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఫోన్ మాట్లాడొద్దన్నందుకు సూసైడ్

హైదరాబాద్, ఆగస్టు 27 (ఈవార్తలు): రాత్రివేళల్లో ఫోన్‌లో ఎక్కువసేపు మాట్లాడొద్దని తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన ఇంటర్ విద్యార్థిని తండ్రి కళ్ల ముందే గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన హైదరాబాద్‌లోని ఉప్పుగూడ వద్ద చోటుచేసుకుంది. ఛత్రినాకలో నివాసం ఉంటున్న శ్రీనివాస్ కుమార్తె తేజస్వి(17) ఇంటర్ సెకండియర్ చదువుతోంది. తేజస్వి నిత్యం అర్ధరాత్రి వరకు ఫోన్‌లో మాట్లాడుతుండడాన్ని గుర్తించిన తండ్రి శ్రీనివాస్ ఆమెను మందలించినట్లు సమాచారం. దీంతో మనస్తాపానికి గురైన తేజస్వి అర్ధరాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఇది గమనించిన తండ్రి శ్రీనివాస్ ఆమెను అనుసరిస్తూ వెళ్లాడు. అయితే ఉప్పుగూడ వద్దకు చేరుకున్న అనంతరం వేగంగా వస్తున్న గూడ్స్ రైలు కింద తేజస్వి పడిపోయి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## నేపాల్ వరదల్లో
# తెలుగోళ్లు 29 మంది గల్లంతు

హైదరాబాద్, ఆగస్టు 27 (ఈవార్తలు): నేపాల్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు కైలాస మానస సరోవర యాత్రకు వెళ్లిన తెలుగు రాష్ట్రాల యాత్రికులను తీవ్ర కష్టాల్లోకి నెట్టాయి. ఈ విపత్తు కారణంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు, తెలంగాణకు చెందిన 22 మందితో సహా మొత్తం 29 మంది ఆచూకీ ఇంకా లభించలేదని అధికారులు గురువారం తెలిపారు. వీరిని సురక్షితంగా వెనక్కి తీసుకురావడానికి ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు యాత్రికుల ఆచూకీ తెలియరాలేదని, మరో 34 మంది సురక్షితంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. కర్నూలు–ఆదోనికి చెందిన నలుగురు టిబెట్‌లో క్షేమంగా ఉండగా, తిరుపతి ప్రాంతానికి చెందిన 28 మంది యాత్రికులు ఖాట్మండులో సురక్షితంగా ఉన్నట్లు రియల్–టైమ్ గవర్నెన్స్ సొసైటీ ద్వారా సంప్రదించి నిర్ధారించుకున్నారు. గల్లంతైన ఏడుగురిలో చిత్తూరు, విజయవాడ, కాకినాడ, గుంటూరుకు చెందిన వారున్నారు. వీరిలో ముగ్గురు ఈశా ఫౌండేషన్ నిర్వహించిన యాత్రలో పాల్గొన్నారని, వారి ఫోన్లు స్విచ్ ఆఫ్ వస్తున్నాయని తెలిపారు. ఈ పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా తీసుకురావడమే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. బాధితుల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకుని, వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం, ఖాట్మండు, చైనాలలోని భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు.

## మహిళలపై
# ప్రెస్ మీట్ పెట్టను: అనిరుధ్ రెడ్డి

జడ్చర్ల, ఆగస్టు 27 (ఈవార్తలు): కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన మంత్రి కొండా సురేఖ ఎపిసోడ్‌పై ఆ పార్టీ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు మహిళల పట్ల అపారమైన గౌరవం ఉందని, మహిళలపై తాను ఎప్పుడూ ప్రెస్ మీట్ పెట్టనని ఆయన స్పష్టం చేశారు. సొంత తల్లి తిట్టినా సరే ఏమీ మాట్లాడకుండా సైలెంట్‌గా అక్కడి నుంచి వెళ్లిపోతానని, మహిళలు తిట్టారని భావించి వారిని తిరిగి విమర్శిస్తే సమాజంలోని మహిళలంతా మనపై రివర్స్ అయ్యే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. మహిళలు కన్నీళ్లు పెట్టుకుని వారి కంటి నుంచి ఒక్క చుక్క నీరు భూమిపై పడినా, ఆ కన్నీటి చుక్క సునామీగా మారి మనల్ని కొట్టుకుపోయేలా చేస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. అందుకే వారిపై మీడియా ముందు మాట్లాడే ప్రసక్తే లేదని, ఒకవేళ తనను ఎవరైనా తిట్టినా వాటిని అక్షింతలుగానే స్వీకరిస్తానని తెలిపారు. ఇక కొండా సురేఖ వివాదంపై పార్టీ నాయకులు ఎవరూ బహిరంగంగా మాట్లాడవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని గుర్తుచేశారు. ఈ అంశంపై ఇప్పటికే కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ సుదీర్ఘంగా విచారణ జరుపుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ఏఐసీసీ, పీసీసీ లేదా సీఎం రేవంత్ రెడ్డి ఏ నిర్ణయం తీసుకున్నా దానికి తామంతా పూర్తిస్థాయిలో కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. తప్పు ఎవరు చేశారనేది దేవుడు చూస్తున్నాడని, క్రమశిక్షణ కమిటీ ఇచ్చే తుది నివేదికను తాము శిరసావహిస్తామన్నారు. ఇదే సమయంలో తన నియోజకవర్గ అభివృద్ధికి రావాల్సిన నిధుల కోసం గట్టిగా పోరాడతానని, అవసరమైతే ప్రజల సంక్షేమం కోసం దీక్షలైనా చేస్తానని తెలిపారు.

# ‘ఇరుముడి’ని బ్యాన్ చేయాలి

**నారా లోకేశ్‌కు టీచర్ల ఫిర్యాదు**




అమరావతి, ఆగస్టు 27 (ఈవార్తలు): ప్రముఖ నటుడు రవితేజ కథానాయకుడిగా నటించిన ‘ఇరుముడి’ చిత్రంపై తీవ్ర వివాదం రాజుకుంది. ఈ సినిమాలో ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయులను కించపరిచేలా కొన్ని సన్నివేశాలు ఉన్నాయంటూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు అందింది. ఏపీ ప్రాథమికోపాధ్యాయ సంఘం (ఏపీటీఏ) ఈ విషయాన్ని మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది. అటు, ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బోరా గోపి మూర్తి ఇరుముడి చిత్రంలోని కొన్ని సన్నివేశాలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సినిమాలోని ఆక్షేపణీయ సన్నివేశాలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేశ్‌కు వారు విజ్ఞప్తి చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఎమ్మెల్సీ గోపి మూర్తి మీడియా సమావేశంలో మాట్లాడుతూ సినిమాలోని అంశాలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నియోజకవర్గంలోని ఓ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ సినిమాను చిత్రీకరించారని, కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బాలికల యూనిఫామ్‌ను సినిమాలో చూపించారని తెలిపారు. ఓ మహిళా ఉపాధ్యాయురాలిని అత్యంత క్రూరంగా, ప్రతికూల స్వభావంతో చిత్రీకరించారని ఆరోపించారు. స్పెషల్ క్లాసుల పేరుతో ఓ విద్యార్థినిని ఎమ్మెల్యే వద్దకు పంపే సన్నివేశం అత్యంత దారుణంగా ఉందని, ఇది ప్రజాప్రతినిధులపై కూడా తప్పుడు అభిప్రాయం కలిగించేలా ఉందని విమర్శించారు. పాత్రలు కల్పితమైనప్పటికీ, ప్రభుత్వ పాఠశాల వాతావరణంలో, ప్రభుత్వ యూనిఫామ్స్‌తో చిత్రీకరించడం వల్ల సమాజంలోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని గోపి మూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. సినిమా అనేది శక్తిమంతమైన మాధ్యమమని, దర్శక, నిర్మాతలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ పాఠశాలల పట్ల సామాజిక బాధ్యత ఉండాలని హితవు పలికారు. ఉపాధ్యాయులను కించపరచడం విద్యను అవమానించడమేనని, ప్రభుత్వ బడులను చులకనగా చూపడం లక్షలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నో సవాళ్ల మధ్య పేద విద్యార్థులకు విద్యనందిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులందరినీ అవమానించేలా ఈ చిత్రీకరణ ఉందని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొన్నాయి. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెంటనే స్పందించి, సినిమా నుంచి వివాదాస్పద సన్నివేశాలను తొలగించేలా ఆదేశాలు జారీ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# అన్న నా ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాడు!

**రాఖీ వేళ కేటీఆర్‌పై కవిత ఫైర్**



హైదరాబాద్, ఆగస్టు 27 (ఈవార్తలు:) రాఖీ పండుగ నేపథ్యంలో తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత తన సోదరుడు, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన సోదరుడికి రాఖీ కట్టే అవకాశం మరోసారి దక్కకపోవడంపై ఆమె తీవ్ర ఆవేదన, అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆడబిడ్డగా తన ఆత్మగౌరవం దెబ్బతిన్నదని వ్యాఖ్యానించడం చర్చనీయాంశంగా మారింది. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రాఖీ పండుగ ప్రస్తావన రాగా కవిత భావోద్వేగానికి గురయ్యారు. “ఈసారి కేటీఆర్‌కు రాఖీ కడతారా?” అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ఆమె స్పందిస్తూ, “పోయినసారి అడిగితే ఆయన ఊర్లో లేకుండా పారిపోయారు. ఈసారి అడగకుండానే ఏకంగా విదేశాలకు వెళ్లిపోయారు. ఆడబిడ్డలమైన మాకు కూడా ఆత్మగౌరవం ఉంటుంది కదా? మా ఆత్మగౌరవం చాలా తీవ్రంగా దెబ్బతింది” అని ఆవేదనతో అన్నారు. రాఖీ అంటే రక్త సంబంధమని, దాన్ని రాజకీయాలతో ముడిపెట్టకూడదని ఆమె హితవు పలికారు. రాఖీ విషయంలో తన అసంతృప్తిని వెళ్లగక్కడంతోనే కవిత ఆగలేదు. బీఆర్ఎస్ కీలక నేత హరీశ్ రావుపై సంచలన ఆరోపణలు చేశారు. హరీశ్ రావు, బీజేపీ–ఆర్ఎస్ఎస్ మద్దతుతో బీఆర్ఎస్ పార్టీని హస్తగతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇందుకోసం మెదక్‌లో రహస్య సమావేశాలు కూడా నిర్వహించారని అన్నారు. “నా సోదరుడు కేటీఆర్ చాలా అమాయకుడు, అందుకే నన్ను ఒక పథకం ప్రకారం పార్టీ నుంచి బయటకు పంపించారు” అని కవిత ఆరోపించారు. బీఆర్ఎస్‌లో ప్రస్తుతం తీవ్ర అంతర్గత సంక్షోభం నడుస్తోందని, అందుకే ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆమె విమర్శించారు. పార్టీలో నెలకొన్న ఈ సంక్షోభం కారణంగానే ప్రజల పక్షాన నిలబడటంలో విఫలమవుతున్నారని అన్నారు. ప్రజలు ఈ విషయాలను గమనించి, తమలాంటి వారిని ఆశీర్వదించాలని కోరారు. .



# నేటి నుంచి ఇందిరమ్మ టవర్స్ లక్కీడ్రా

హైదరాబాద్, ఆగస్టు 27 (ఈవార్తలు): ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ (ఎల్ఐజీ ఫ్లాట్లు) లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు రంగం సిద్ధమైంది. ఆగస్టు 28 నుంచి 31 వరకు నాలుగు రోజుల పాటు పూర్తి పారదర్శకంగా లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని యూట్యూబ్, ఇతర సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్ష ప్రసారం చేయనుండటం గమనార్హం. హైదరాబాద్ క్యూర్ (సీయూఆర్ఈ) పరిధిలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్మించిన 7,340 ఫ్లాట్ల కోసం మొత్తం 60,720 దరఖాస్తులు అందాయి. వీటిని పరిశీలించిన అధికారులు 40,900 మందిని అర్హులుగా గుర్తించగా, 19,820 దరఖాస్తులను వివిధ కారణాలతో అనర్హమైనవిగా తేల్చారు. అర్హులైన దరఖాస్తుదారుల నుంచే లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఈ ప్రక్రియపై హౌసింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ వీపీ గౌతం మాట్లాడుతూ.. “లబ్ధిదారుల ఎంపిక అత్యంత పారదర్శకంగా జరుగుతుంది. మధ్యవర్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దు. డబ్బులు తీసుకుని ఫ్లాట్ ఇప్పిస్తామని ఎవరైనా చెబితే మోసపోకండి. డ్రా ప్రక్రియను దరఖాస్తుదారులు, మీడియా ప్రతినిధుల సమక్షంలో నిర్వహిస్తున్నాం” అని స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సైతం ఈ వివరాలను వెల్లడించారు. రిజర్వేషన్ల ప్రకారం (ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, శానిటేషన్ వర్కర్లు) కేటాయింపులు జరుపుతామని తెలిపారు. ఆగస్టు 28న రాయదుర్గం, కేపీహెచ్‌బీ, 29న కౌకూర్, పాటిగడ్డ, 30న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే కాలనీ, బోయిన్‌పల్లి, 31న గాజులరామారం, అంబర్‌పేట, పోచారం వంటి ప్రాంతాల్లోని ఫ్లాట్లకు డ్రా నిర్వహిస్తారు. లక్కీ డ్రాలో ఫ్లాట్ పొందని వారికి వారు చెల్లించిన రూ.10,000 ఈఎండీ మొత్తాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి తిరిగి జమ చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. దరఖాస్తుదారులు తేదీలు, లైవ్ స్ట్రీమింగ్ లింక్‌ల కోసం అధికారిక వెబ్‌సైట్లయిన tghb.telangana.gov.in లేదా మీసేవా పోర్టల్‌ను సందర్శించాలని సూచించారు.

## పెరోల్‌పై వచ్చి 30 ఏళ్లు టీచర్ విధులు

మహబూబాబాద్, ఆగస్టు 27 (ఈవార్తలు): జీవిత ఖైదు శిక్ష పడిన ఓ వ్యక్తి పెరోల్‌పై బయటకు వచ్చి ఏకంగా 40 ఏళ్ల పాటు పోలీసుల కళ్లుగప్పి స్వేచ్ఛగా జీవించాడు. ఈ సుదీర్ఘ కాలంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సంపాదించి, ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకుని, పదవీ విరమణ కూడా చేశాడు. సినిమా కథను తలపించే ఈ వింత ఘటన మహబూబాబాద్ జిల్లాలో ఆలస్యంగా వెలుగుచూసింది. దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామానికి చెందిన సందెల వీరన్నకు ఓ కేసులో 1983లో వరంగల్ కోర్టు జీవిత ఖైదు విధించింది. అదే ఏడాది డిసెంబర్‌లో పెరోల్‌పై విడుదలైన అతడు.. 1984 మార్చిలో తిరిగి జైలుకు లొంగిపోవాల్సి ఉన్నా పరారయ్యాడు. అప్పటి నుంచి మహబూబాబాద్ జిల్లాలోనే ఉంటూ ప్రభుత్వ టీచర్‌గా ఉద్యోగం సంపాదించాడు. 2004లో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు కూడా అందుకుని, 2013లో రిటైరయ్యాడు. దాదాపు 40 ఏళ్ల తర్వాత, ఈ ఏడాది మే 16న వరంగల్ సెంట్రల్ జైలు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు వీరన్నను అరెస్ట్ చేసి చర్లపల్లి జైలుకు తరలించారు. అతడికి మూడేళ్ల పాటు పెరోల్, శిక్షా మినహాయింపు నిరాకరిస్తూ జైళ్ల శాఖ మెమో జారీ చేసింది. దీనిపై వీరన్న భార్య చారమ్మ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ టి. మాధవీ దేవి ధర్మాసనం.. నిందితుడు ఉద్దేశపూర్వకంగానే తప్పించుకు తిరిగాడని స్పష్టం చేస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ ఘటనపై ఆశ్చర్యం వ్యక్తం చేసిన న్యాయస్థానం, జైళ్ల శాఖ ఎంత నిర్లక్ష్యంగా ఉందో చెప్పడానికి ఇదో ఉదాహరణ అని వ్యాఖ్యానించింది. పెరోల్‌పై వెళ్లిన ఖైదీలను పర్యవేక్షించేందుకు పటిష్ఠమైన ట్రాకింగ్ వ్యవస్థతో పాటు కొత్త మార్గదర్శకాలు రూపొందించాలని జైళ్ల శాఖను ఆదేశించింది.

## రేవంత్ మీరాలం చెరువు
## పనుల ఆకస్మిక పర్యటన

హైదరాబాద్, ఆగస్టు 27 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని మీరాలం చెరువు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఉదయం ఆకస్మికంగా పరిశీలించారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సస్పెన్షన్ బ్రిడ్జి పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. పనుల తీరును పరిశీలించేందుకు భారీ క్రేన్‌పైకి ఎక్కి మరీ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడం గమనార్హం. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడిన ముఖ్యమంత్రి, పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. చెరువులోకి ఎలాంటి పరిస్థితుల్లోనూ మురుగునీరు వచ్చి చేరకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మీరాలం నుంచి మూసీలోకి వరద నీరు సులభంగా వెళ్లేలా నాలాను విస్తరించాలని కూడా సూచించారు. చెరువులో ఉన్న ఐల్యాండ్‌ను అభివృద్ధి చేయాలని, వాటర్ స్పోర్ట్స్ నిర్వహించేందుకు వీలుగా డిజైన్ రూపొందించాలని తెలిపారు. మొత్తంమీద మీరాలం చెరువును ఒక ప్రధాన పర్యాటక ఆకర్షణ కేంద్రంగా తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## మీరిచ్చే ప్రతి పైసా..
## ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి ‘ఈవార్తలు’ నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి ‘ఈవార్తలు’. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

## కౌశిక్ రెడ్డికి
# ఎథిక్స్ కమిటీ నోటీసులు

హైదరాబాద్, ఆగస్టు 27 (ఈవార్తలు): బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి తెలంగాణ శాసనసభ ఎథిక్స్ కమిటీ నోటీసులు జారీ చేయడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై వచ్చిన ఫిర్యాదును విచారించేందుకు ఈ నెల 29న ఉదయం 11 గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్–1లో ఎథిక్స్ కమిటీ సమావేశం కానుంది. అయితే, ఈ నోటీసులపై బీఆర్ఎస్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. ఎథిక్స్ కమిటీ పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని... కౌశిక్ రెడ్డిని రాజకీయంగా బలిచేసేందుకే ఈ కుట్రలు పన్నుతోందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఘాటుగా విమర్శించారు. శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు దానం నాగేందర్, మందుల సామేల్, వీర్లపల్లి శంకర్, మంత్రి పొన్నం ప్రభాకర్ గతంలో మాట్లాడిన తీవ్రమైన పదజాలం, అసభ్య సైగల వీడియోలను ఈ సందర్భంగా వేముల ప్రదర్శించారు. సభలో సీఎం, అధికార పక్ష నాయకులు చేసిన బెదిరింపులు, వ్యాఖ్యలు ఎథిక్స్ కమిటీ పరిధిలోకి రావా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. అంతేకాకుండా, కౌశిక్ రెడ్డి వ్యవహారాన్ని స్పీకర్ సిఫార్సు చేసిన సమయంలో అసలు ఎథిక్స్ కమిటీయే మనుగడలో లేదని, అలాంటప్పుడు ఆ అంశాన్ని కమిటీకి ఎలా రెఫర్ చేస్తారని వేముల నిలదీశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో లబ్ధి పొంది ఇప్పుడు అదే పార్టీపై విమర్శలు చేస్తున్న కడియం శ్రీహరి వైఖరిని మాత్రమే కౌశిక్ రెడ్డి ఆక్షేపించారని, దీనిపై కక్షపూరితంగా వ్యవహరించడం కాంగ్రెస్ మార్క్ రాజకీయాలకు నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు.

# సర్‌లో ఫేక్ డాక్యుమెంట్లు!

**కఠిన చర్యలు తప్పవని ఈసీ వార్నింగ్**

హైదరాబాద్, ఆగస్టు 27 (ఈవార్తలు): తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఎవరైనా తప్పుడు పత్రాలు సమర్పిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) హెచ్చరించారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని, నకిలీ పత్రాలను సమర్పించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన ఆయన స్పష్టం చేశారు. ఓటర్లు సమర్పించే పత్రాలను, డిక్లరేషన్లను అధికారులు స్వతంత్రంగా ధ్రువీకరిస్తారని సీఈఓ కార్యాలయం వెల్లడించింది. ప్రభుత్వ అధికారికి తప్పుడు సమాచారం అందించడం భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 217 ప్రకారం శిక్షార్హమని పేర్కొన్నారు. అదేవిధంగా, ఓటర్ల జాబితా సవరణలో తప్పుడు డిక్లరేషన్ ఇస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం–1950లోని సెక్షన్ 31 ప్రకారం జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే 2 లక్షల మందికి పైగా ఓటర్లకు నోటీసులు జారీ చేశారు. మొత్తం మీద 92.8 లక్షల మంది ఓటర్లకు నోటీసులు అందజేయనున్నారు. వీరిలో 60.5 లక్షల మంది ఓటర్ల డేటాలో వ్యత్యాసాలు ఉండగా, మరో 32.3 లక్షల మంది వివరాలు 2002 ఓటర్ల జాబితాతో సరిపోలడం లేదని అధికారులు గుర్తించారు. విచారణ సమయంలో ఓటర్లు గానీ, వారి కుటుంబ సభ్యులు గానీ తప్పనిసరిగా వ్యక్తిగతంగా హాజరు కావాలని అధికారులు సూచించారు. ఓటర్లు తమ వివరాల స్థితిని ఆన్‌లైన్‌లో మొబైల్ నంబర్‌తో లాగిన్ అయి, ఎపిక్ నంబర్ నమోదు చేసి, ఓటీపీ ద్వారా స్వయంగా ధ్రువీకరించుకోవచ్చని వెల్లడించారు.

# గళమెత్తిన సర్కారీ ఉద్యోగులు

## పీఆర్సీ వెంటనే ప్రకటించాలి.. పెండింగ్ డీఏలు విడుదల చేసి

## సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలి.. డిమాండ్ల సాధనకు మహా ధర్నా






ములుగు, ఆగస్టు 27 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ పిలుపుమేరకు ములుగు జిల్లా కేంద్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, జేఏసీ నాయకుడు డా. దామెర రాజేందర్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ)ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం (డీఏ)లను తక్షణమే విడుదల చేయాలని కోరారు. అలాగే ఉద్యోగుల భవిష్యత్‌కు భరోసా కల్పించే పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించి, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ విధులను బాధ్యతగా నిర్వర్తిస్తూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతన సవరణ చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ ధర్నాలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రతినిధులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు.

### ఉద్యోగుల గళం.. ప్రభుత్వం వినాల్సిందే

కరీంనగర్, ఆగస్టు 27 (ఈవార్తలు): ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట భారీ మహాధర్నా నిర్వహించారు. జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ధర్నా చౌక్ కిక్కిరిసిపోయింది. పీఆర్సీ అమలు, పెండింగ్‌లో ఉన్న డీఏల విడుదల, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరణ, ఉద్యోగులు, పెన్షనర్ల పెండింగ్ బిల్లుల చెల్లింపు, ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడం తదితర డిమాండ్లతో ఉద్యోగులు నినాదాలు చేశారు. మహాధర్నాలో ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమిస్తున్నామని తెలిపారు. ఎంప్లాయీస్ జేఏసీ సెక్రటరీ జనరల్, జేఏసీ కన్వీనర్ మడిపల్లి కాళీచరణ్ గౌడ్ కార్యనిర్వహణలో జరిగిన మహాధర్నాలో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. గెజిటెడ్ అధికారులు, నాలుగో తరగతి ఉద్యోగులు, డ్రైవర్లు, పంచాయతీరాజ్, రెవెన్యూ, సబ్‌బోర్డినేట్ శాఖల ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై ఐక్యతను చాటారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, ఎడ్ల అరవింద్ రెడ్డి, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేశవరెడ్డి, ఉస్మాన్ పాషా, ఈశ్వరయ్య, అశోక్ రావు, ఎం.డి. సలీం, కరుణాకర్ రెడ్డి, ఎలదాసరి లింగయ్య, రామస్వామి, శంకర్, ముప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, రవీందర్ రెడ్డి, రాగి శ్రీనివాస్, సర్దార్ హర్మీందర్ సింగ్, రాజేష్ భరద్వాజ్, సుమంత్ రావు, శారద, వరీస్ నవాబు, సతీష్, జనార్ధన్, చంద్రమౌళి, ప్రభాకర్ రావు, కె. రాజు, నరసింహారెడ్డి, లక్ష్మణరావు, సునీత, సరిత, కరుణ, విజయలక్ష్మి, సుస్మిత, ప్రవీణ్ రావు, రాజిరెడ్డి, శ్రీనివాస్, విజయ్, తిరుపతి రెడ్డి, నరసయ్య, సత్యనారాయణ రెడ్డి, ప్రేమ్ సాగర్, వెంకట రాజిరెడ్డి, అభినవ్ రెడ్డి, ఎం.డి. అబ్దుల్, ఎం.డి. యూసుఫ్, రామ్మోహన్ రావు, పోలుకిషన్, రమేష్ గౌడ్, ప్రసాద్ రెడ్డి, నరేష్ పటేల్, సత్యనారాయణ, రోహిత్, గుండ రాజేష్, కమలాకర్, కరుణాకర్, అజ్గర్ అలీ, లవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### సర్కారు డిమాండ్లు నెరవేర్చాల్సిందే

రాజన్న సిరిసిల్ల జిల్లా, ఆగస్టు 27 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి రాష్ట్ర కమిటీ చైర్మన్ మారం జగదీష్, కన్వీనర్ ఏలూరి శ్రీనివాస్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న మహాధర్నాలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో భారీ ధర్నా నిర్వహించారు. జిల్లా ఉద్యోగుల జేఏసీ చైర్మన్ ఎలుసాని ప్రవీణ్ కుమార్, జిల్లా కన్వీనర్ సయ్యద్ జబీ ఆధ్వర్యంలో సిరిసిల్ల కలెక్టర్ కార్యాలయ గేట్ ఆవరణలో జరిగిన ఈ మహాధర్నాకు గెజిటెడ్, నాన్‌గెజిటెడ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా నూతన పీఆర్సీ ప్రకటించడం, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడం, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయడం, పెండింగ్ బిల్లులను చెల్లించడం, ఉద్యోగులకు ఆరోగ్య కార్డులు జారీ చేయడం వంటి ఐదు ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఇవి కొత్తగా చేస్తున్న డిమాండ్లు కావని, ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలనే అమలు చేయాలని కోరుతున్నామని నాయకులు స్పష్టం చేశారు. పెండింగ్ బిల్లుల సంఖ్య దాదాపు 10 వేలకు చేరుకుందని, ముఖ్యంగా పదవీ విరమణ చేసిన ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండటం ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. జూన్ 2 నాటికి ఆరోగ్య కార్డులు జారీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు అమలు కాలేదని విమర్శించారు. ఉద్యోగుల సమస్యలు, పెండింగ్ అంశాలు పరిష్కారం కాకుండా అలాగే మిగిలిపోతున్నాయని తెలిపారు. మహాధర్నాలో జేఏసీ నాయకులు గాజుల సుదర్శన్ (టీఎన్జీవో), బొల్గం సాగర్ (టీజీవో), మెట్ట శ్రీకాంత్, మొహమ్మద్ రియాజ్ (టీఎన్జీవో), జీ. శ్రీనివాస్ రావు (పీఆర్టీయూ), రాంనాథ్ రెడ్డి (టీపిటీఎఫ్), మధుసూదన్ రావు (యూటీఎఫ్), సదానందం (ఎస్టీయూ), సుధాకర్ రెడ్డి (డీటీఎఫ్), బాల్‌రెడ్డి (ఆర్యూపీపీ), రవీందర్ రెడ్డి (అధికారుల సంఘం), హరికిషన్ (టీపీఆర్), నయిమొద్దీన్ (జీజేఎల్), లాల శ్రీనివాస్ (టీయూటీఎఫ్), మోతీలాల్ (హెడ్‌మాస్టర్స్ సంఘం), పురుషోత్తం (రిటైర్డ్ సంఘం), కృష్ణప్రసాద్ (టీఆర్‌టీఎఫ్), కొమ్ము రమేష్ (బీటీఎఫ్), సాయికిరణ్ (టీఏఓఎస్), విశ్వన్ (ఇంజినీర్ సంఘం), రామస్వామి (డీటీయూ), సురేష్ (పీఈటీ సంఘం), ప్రవీణ్, అనిల్ (పంచాయతీ కార్యదర్శుల సంఘం), మహేందర్ రావు (టీఎస్‌యూటీఎఫ్), బి. శ్రీనివాస్ (టీజీపీ), శివసాయి (వేములవాడ దేవస్థాన సంఘం), ఆర్. శేఖర్ (లెక్చరర్ల సంఘం), లక్ష్మణ్ (ఏఈఓ సంఘం) తదితర వివిధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలు తీర్చాల్సిందే: జీవన్ రెడ్డి

జగిత్యాల, ఆగస్టు 27 (ఈవార్తలు): ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు నిర్వహించిన మహాధర్నాకు ఆయన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఉద్యోగుల సమస్యలను ఆరు నెలల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ వాటిని అమలు చేయడం లేదని విమర్శించారు. ఉద్యోగులకు పీఆర్సీ, డీఏలు పెండింగ్‌లో ఉండటం బాధాకరమన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందడం లేదని ఆరోపించారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగులు కీలక పాత్ర పోషించారని, వారి హక్కుల కోసం కేసీఆర్ అండగా నిలిచారని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో 600కు పైగా గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశామని తెలిపారు. జాబ్ క్యాలెండర్ అమలు చేయకుండా యువతను ప్రభుత్వం నిరాశకు గురిచేస్తోందని విమర్శించారు. సమ్మె ఉద్యోగులకు చివరి అస్త్రమని, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కేసీఆర్ తొలి సంతకం చేస్తారని హామీ ఇచ్చారు. ఉద్యోగులు, యువతకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.



## స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

**టీఆర్ఎస్ ఆధ్వర్యంలో కోరుట్లలో భారీ నిరసన**

కోరుట్ల, ఆగస్టు 27 (ఈవార్తలు): ప్రజలపై అదనపు విద్యుత్ భారం మోపే స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రక్షణ సేన కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రఘు డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో కోరుట్ల పట్టణంలో భారీ నిరసన చేపట్టారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘు మాట్లాడుతూ.. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై మరో ఆర్థిక భారం మోపడం సరికాదన్నారు. ప్రజల సంక్షేమానికి అనుగుణంగా ప్రభుత్వ విధానాలు ఉండాలని కోరారు. సీనియర్ నాయకుడు అజార్ మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలపై భారం పడే నిర్ణయాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు ప్రజల పక్షాన ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు సుఖేందర్ గౌడ్, లింగంపల్లి సంజీవ్, సాయి రెడ్డి, శివారెడ్డి, రాజన్న, నాగరాజు, సోమిడి ప్రశాంత్, కోరుట్ల రాజు, మందుల విజయ్, ఆరిఫ్, మతిన్, ఇర్ఫాన్ ముస్తఫా, ఖాలీద్ తదితరులు పాల్గొన్నారు.

## మెట్‌పల్లి తహసీల్దార్ సస్పెన్షన్

మెట్‌పల్లి, ఆగస్టు 27 (ఈవార్తలు): భూ భారతి రీ–సర్వే, ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు మెట్‌పల్లి తహసీల్దార్ నీతాపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ విషయాన్ని ఆర్డీవో నరసింహారావు తెలిపారు. సంబంధిత పనుల పురోగతిలో తహసీల్దార్ నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు గుర్తించిన జిల్లా కలెక్టర్ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆర్డీవో పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత కలిగిన భూ భారతి రీ–సర్వే, ఎస్ఐఆర్ ప్రక్రియలను నిర్దేశిత గడువులో పూర్తి చేయడంలో అలసత్వాన్ని తీవ్రంగా పరిగణించినట్లు తెలిపారు. మెట్‌పల్లి తహసీల్దార్‌గా నీతా స్థానంలో ముక్తార్ పాషాను నియమించినట్లు ఆర్డీవో వెల్లడించారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవనే సంకేతాన్ని ఈ సస్పెన్షన్ ఇచ్చిందని అధికారులు పేర్కొన్నారు.

## కూకట్‌పల్లిలో కాంగ్రెస్‌లో భారీ చేరికలు

**రోజురోజుకు పెరుగుతున్న ప్రజాదరణ: బండి రమేష్**



కూకట్‌పల్లి, ఆగస్టు 27 (ఈవార్తలు): కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అల్లాపూర్ డివిజన్ శివాజీనగర్‌లో కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు జరిగాయి. వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరారు. స్థానిక కాంగ్రెస్ నాయకుడు లక్ష్మణ్ గౌడ్ సారథ్యంలో నిర్వహించిన ఈ చేరికల కార్యక్రమం టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరడం శుభపరిణామమన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యం కీలకమని అన్నారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ కుటుంబంలో చేరిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక స్వాగతం పలుకుతూ, రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని బండి రమేష్ కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, బ్లాక్ మహిళా అధ్యక్షురాలు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, మైనారిటీ నాయకులు, ఎస్సీ సెల్, బీసీ సెల్ నాయకులు, సేవాదళ్ నాయకులు, సామాజిక మాధ్యమాల ప్రతినిధులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఓటర్ల జాబితా సరిచూసుకోవాలి

జగిత్యాల, ఆగస్టు 27 (ఈవార్తలు): జగిత్యాల మున్సిపాలిటీ ఉస్మాన్‌పురాలోని 46వ వార్డులో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)పై గురువారం వార్డు సభ నిర్వహించారు. కౌన్సిలర్ అనీస్ ఖుతేజ ఖాజా హసీబ్ ఉద్దీన్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముసాయిదా ఓటర్ల జాబితా, ఓటర్ల వివరాల సవరణ, కొత్తగా అర్హులైన ఓటర్ల నమోదు, దావాలు, అభ్యంతరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అనీస్ ఖుతేజ ఖాజా హసీబ్ ఉద్దీన్ మాట్లాడుతూ వార్డులోని ప్రతి ఒక్కరూ ముసాయిదా ఓటర్ల జాబితాలో తమ పేరు, వయస్సు, చిరునామా, ఫొటో తదితర వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. వివరాల్లో ఏవైనా తప్పులు లేదా పొరపాట్లు ఉంటే సంబంధిత ఆధారాలతో సవరణ చేసుకోవాలని తెలిపారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు పూర్తి చేసుకునే యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. అర్హత ఉన్నప్పటికీ ఓటర్ల జాబితాలో పేరు నమోదు కాకుండా మిగిలిపోయిన వారు, వివరాల్లో మార్పులు అవసరమైన వారు నిర్ణీత ఫారాలు, అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. గత రికార్డులతో ఓటర్ల వివరాల అనుసంధానంలో తేడాలు ఉన్నవారు, ధ్రువీకరణ అవసరమైన వారు సంబంధిత ఆధారాలను అందించాలని తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ప్రతి అర్హుడి పేరు జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లు తొలగించేలా ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ దూమల రాజ్‌కుమార్, 34వ వార్డు కౌన్సిలర్ అయ్యూబ్ ఖాన్, సామాజిక కార్యకర్తలు సుల్తాన్ ఉద్దీన్ అహ్మద్, సాబిర్, జమీర్ ఉద్దీన్ అద్నాన్, బీఎల్‌ఓలు షాహీన్ సుల్తానా, రిజ్వాన బేగం, వార్డు ఆఫీసర్ రాఫే, హుస్సైన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## రహస్య అరల్లో అక్రమ మద్యం

**రూ.6.38 లక్షల విలువైన మద్యం స్వాధీనం**

మెట్‌పల్లి, ఆగస్టు 27 (ఈవార్తలు): దాద్రా నగర్ హవేలీ నుంచి తెలంగాణకు అక్రమంగా తరలిస్తున్న మద్యం డంప్‌ను మెట్‌పల్లి ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. రూ.6.38 లక్షల విలువైన 70 బాక్సుల ఇంపీరియల్ బ్లూ (ఐబీ) మద్యాన్ని స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. మద్యం రవాణాకు ఉపయోగించిన వ్యాన్‌తో పాటు నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 14న కథలాపూర్ మండలం గంభీరపూర్‌లో 13 బాక్సుల అక్రమ మద్యం పట్టుబడిన కేసు దర్యాప్తులో లభించిన సమాచారం, సాంకేతిక ఆధారాలతో ఎక్సైజ్ అధికారులు నిఘా పెంచారు. ఈ క్రమంలో మహారాష్ట్ర భివాండీకి చెందిన ప్రధాన నిందితుడు ప్రవీణ్ సిరిగిరి దాద్రా నగర్ హవేలీలో రూ.2.85 లక్షలకు 70 బాక్సుల ఐబీ మద్యాన్ని కొనుగోలు చేసినట్లు గుర్తించారు. వాటిని గంభీరపూర్‌కు తరలించేందుకు డ్రైవర్ ప్రదీప్ జైస్వాల్, అతడి స్నేహితుడు అజయ్ భగవాన్‌తో రూ.65 వేల ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. పోలీసులకు అనుమానం రాకుండా వ్యాన్‌లో ప్రత్యేక ర్యాక్‌లు, రహస్య అరలను ఏర్పాటు చేసి మద్యం బాక్సులను దాచిపెట్టి తరలించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. పక్కా సమాచారంతో నిఘా పెట్టిన ఎక్సైజ్ అధికారులు వ్యాన్‌ను పట్టుకుని మద్యం డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ మద్యం రవాణా ముఠాపై నిఘా కొనసాగుతోందని, దర్యాప్తులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



## చందుర్తి ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఏర్పాటు

చందుర్తి, ఆగస్టు 27 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. మండల ఇన్‌చార్జి తర శంకర్ మాదిగ అధ్యక్షతన, జిల్లా ఇన్‌చార్జి పుట్టా రవి మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ కమిటీ ఎన్నికలు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నిర్వహించారు. నూతన కార్యవర్గంలో చందుర్తి మండల అధ్యక్షుడిగా కట్కూరి ప్రశాంత్ మాదిగ, అధికార ప్రతినిధిగా కొమ్ము సాగర్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా ఆవునూరి రాజు మాదిగను నియమించారు. ఉపాధ్యక్షులుగా లింగంపల్లి అర్జున్ మాదిగ, కన్నం దేవరాజు మాదిగ, లింగంపల్లి శంకర్ మాదిగలను, కార్యదర్శిగా అక్కెనపల్లి రాజేందర్‌ను నియమించినట్లు జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి పుట్టా రవి మాదిగ తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ఎమ్మార్పీఎస్ ఆశయాల సాధనకు కృషి చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పుట్టా రవి మాదిగ సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆవునూరి ప్రభాకర్ మాదిగ, ఖానాపురం లక్ష్మణ్ మాదిగ, చిలుక అంజిబాబు, మోకానపల్లి దేవరాజ్, ఎలగందుల బిక్షపతి మాదిగ, బహుజన గర్జన గజ్జల అశోక్ మాదిగ, శోభారాణి, దొబ్బల ఆనంద్, ఉమ్మడి జిల్లా ఎంఎస్ఎఫ్ కన్వీనర్ నవీన్, నరేష్ మాదిగ, సామాజిక మాధ్యమాల ఇన్‌చార్జి జింక శ్రీధర్, చందుర్తి మండలంలోని అన్ని గ్రామాల గ్రామశాఖ అధ్యక్షులు, మాదిగ కుల సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సర్ మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసులు

కూకట్‌పల్లి, ఆగస్టు 27 (ఈవార్తలు): ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా 2002 నాటి ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసులు అందించే అంశంపై ఆల్విన్ కాలనీ సర్కిల్ డీసీ చాముండేశ్వరి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తాజా మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీ చాముండేశ్వరి మాట్లాడుతూ అన్‌మ్యాపింగ్ కేటగిరీలో ఉన్న ఓటర్లకు బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) నోటీసులు అందించి, సంబంధిత వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారని తెలిపారు. నోటీసులో పేర్కొన్న నిర్ణీత తేదీ, సమయంలో ఓటర్లు సంబంధిత కేంద్రాల్లో ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్వో), సహాయ ఎన్నికల నమోదు అధికారి (ఏఈఆర్వో) ఎదుట అవసరమైన ధ్రువపత్రాలతో హాజరు కావాల్సి ఉంటుందని వివరించారు. ఆన్‌లైన్ ద్వారా కూడా నోటీసులో పేర్కొన్న పత్రాలను అప్‌లోడ్ చేసే అవకాశం ఉందని తెలిపారు. నోటీసు వచ్చినంత మాత్రాన ఓటు తొలగించబోరని, అర్హులైన ఓటర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగించబోమని ఆమె స్పష్టం చేశారు.

# జన్‌ధన్.. పేదోళ్ల బొడ్ల సంచి!



## ఓయూలో జన్మాష్టమి వేడుకల పోస్టర్

హైదరాబాద్, ఆగస్టు 27 (ఈవార్తలు): ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను విద్యార్థి నాయకులు కడారి రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థుల ఆధ్వర్యంలో భక్తి, సమానత్వం, సామాజిక చైతన్యం, సాంస్కృతిక విలువలను ప్రతిబింబించేలా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు శ్రీకృష్ణుడి సందేశమైన ధర్మం, న్యాయం, సమానత్వం, ప్రజా సంక్షేమం వంటి విలువలను యువతలోకి తీసుకెళ్లడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా సెప్టెంబర్ 4, 2026న ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో ప్రధాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు పూజా కార్యక్రమం, సాయంత్రం 4 గంటలకు ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకుడు కడారి రమేష్ యాదవ్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ప్రాంగణం కేవలం విద్యాభ్యాసానికి మాత్రమే కాకుండా సామాజిక చైతన్యానికి, ప్రజాస్వామ్య విలువలకు, సాంస్కృతిక ఉద్యమాలకు వేదికగా ఉండాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సమస్యలపై ఏకతాటిపై నిలబడి పోరాడే క్రమంలోనే సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి జన సమితి నాయకులు, దప్పు గోపి, జిల్లాపెల్లి దిలీప్ కుమార్, నూకల మధు యాదవ్, ఆవుల శ్రీధర్ యాదవ్, శివకుమార్ యాదవ్, శ్రీశైలం యాదవ్, కాసిం యాదవ్, రామకృష్ణ, శ్రీశైలం, వీరేష్, శ్రావణ్, సురేందర్, హరీష్ యాదవ్, ప్రవీణ్ కురుమ, నవీన్, శ్రీకాంత్ యాదవ్, పండు, ప్రశాంత్, మల్లేష్, అర్జున్, బీసీ విద్యార్థి విభాగం చైర్మన్ చీరాల వంశీ తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.



## బడిలో.. రాఖీ బంధం

**వేములవాడలోని పలు పాఠశాలల్లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు**

వేములవాడ అర్బన్, ఆగస్టు 27 (ఈవార్తలు): వేములవాడలోని కిడ్స్ కాన్వెంట్ హైస్కూల్‌లో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో ప్రేమ, ఆప్యాయత, సోదరభావం, పరస్పర గౌరవం, బాధ్యత వంటి విలువలను విద్యార్థులకు వివరించారు. పాఠశాల ప్రాంగణంలో వేడుకలు ఆనందంగా, క్రమశిక్షణతో కొనసాగాయి. విద్యార్థుల్లో సోదర, సోదరీ భావాన్ని పెంపొందించడంతో పాటు దేశ ఔన్నత్యానికి ఇటువంటి పండుగలు దోహదపడతాయని పాఠశాల కరస్పాండెంట్ నరాల దేవేందర్, ప్రిన్సిపాల్ ధరక్షన్ వసుపియా తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ సభ్యులు హాజరై రక్షాబంధన్ పండుగ విశిష్టత, భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులతో రాఖీలు కట్టించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో గురువారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తోటి విద్యార్థులకు రాఖీలు కట్టి, మిఠాయిలు తినిపించి సోదరభావాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బూర ఉమా రమేశ్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో రక్షాబంధన్ పండుగకు విశిష్ట స్థానం ఉందన్నారు. తోబుట్టువుల మధ్య ప్రేమానురాగాలను బలోపేతం చేయడంతో పాటు సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించే అద్భుతమైన పండుగ రాఖీ అని పేర్కొన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు భారతీయ విలువలు, సంప్రదాయాల విశిష్టతను అలవర్చడమే ఇలాంటి కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ వేడుకల్లో పాఠశాల ప్రిన్సిపాల్ హరికిషన్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లక్ష్య సాధనకు కృషి, పట్టుదల అవసరం

**ఉచిత పోలీస్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి.. జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్**

జగిత్యాల రూరల్, ఆగస్టు 27 (ఈవార్తలు): కృషి, పట్టుదలతో పాటు ప్రణాళికాబద్ధమైన సాధనతో అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని జగిత్యాల రూరల్ సీఐ దామెర సుధాకర్ అన్నారు. వాల్మీకి ఆవాసం సేవాభారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పోలీస్ శిక్షణ శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించి అభ్యర్థులకు సూచనలు చేశారు. పోటీ పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా చదవడంతో పాటు శారీరక దారుఢ్యంపై నిరంతరం సాధన చేయాలని సూచించారు. మూడు నెలల శిక్షణ కాలంలో ఎలాంటి ఆకర్షణలకు లోనుకాకుండా ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. పోలీస్ ఉద్యోగానికి క్రమశిక్షణ, విషయ పరిజ్ఞానం, కఠోర పరిశ్రమ అవసరమని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో కోచింగ్ పొందలేని గ్రామీణ యువతకు వాల్మీకి ఆవాసం ద్వారా ఉచితంగా శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోలీస్ ఉద్యోగం సాధించాలని కోరారు. కార్యక్రమంలో సేవాభారతి జిల్లా అధ్యక్షుడు ఎస్పీ సుబ్రహ్మణ్యం, కార్యదర్శి మదన్‌మోహన్‌రావు, కమిటీ సభ్యులు, శిక్షణ అభ్యర్థులు పాల్గొన్నారు.



## జాతీయ కరాటేలో అనిరాకు 2 పతకాలు

హైదరాబాద్, ఆగస్టు 27 (ఈవార్తలు): జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్‌లో అనిరా ఆలివ్స్ సంగేపు అద్భుత ప్రతిభ కనబరిచి రెండు పతకాలు కైవసం చేసుకుంది. అండర్-8 బాలికల విభాగంలో పోటీపడిన అనిరా కాటా, కుమిటే విభాగాల్లో పతకాలు సాధించి సత్తా చాటింది. కాటా విభాగంలో రజత పతకం, కుమిటే విభాగంలో కాంస్య పతకాన్ని గెలుచుకుంది. గతంలో కూడా అనిరా పలు కరాటే పోటీల్లో పాల్గొని పతకాలు సాధించింది. కరాటేతో పాటు తైక్వాండోలోనూ శిక్షణ తీసుకుంటూ పతకాలు కైవసం చేసుకుంది. ప్రస్తుతం కోచ్ కిరణ్ పర్యవేక్షణలో అనిరా కరాటేలో ప్రత్యేక శిక్షణ పొందుతోంది. జాతీయ స్థాయిలో రెండు పతకాలు సాధించిన అనిరాను కోచ్ కిరణ్, పలువురు క్రీడా ప్రముఖులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

### 59.09 కోట్ల ఖాతాలు.. 32.92 కోట్ల మహిళా లబ్ధిదారులు

### అందరికీ బ్యాంకింగ్... అందరికీ సాధికారత.. రూ.3.16 లక్షల కోట్ల డిపాజిట్లు

## ఆర్థిక సమ్మిళితానికి బలమైన పునాది



**(ప్రత్యేక కథనం - పీఐబీ సహకారంతో..)**

దేశంలోని ప్రతి వర్గాన్నీ అధికారిక బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రారంభించిన ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన 12 ఏళ్ల ప్రస్థానంలో కీలక మైలురాళ్లను అధిగమించింది. 2014లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా కోట్లాది మంది నిరుపేదలు, మహిళలు, గ్రామీణులు మొదటిసారిగా బ్యాంకింగ్ సేవలతో అనుసంధానమయ్యారు. బ్యాంకు ఖాతాలతోపాటు రుణాలు, బీమా, పింఛన్లు, ప్రత్యక్ష ప్రయోజన బదిలీ, డిజిటల్ చెల్లింపుల వంటి సేవలు ప్రజలకు మరింత చేరువయ్యాయి. 2015లో 14.72 కోట్లుగా ఉన్న జన్‌ధన్ ఖాతాల సంఖ్య 2026 ఆగస్టు 19 నాటికి 59.09 కోట్లకు చేరడం ఈ పథకం విస్తృతికి నిదర్శనం. వీటిలో 32.92 కోట్ల ఖాతాలు మహిళల పేరుపై ఉండటం మహిళల ఆర్థిక సాధికారతకు పథకం అందించిన తోడ్పాటును స్పష్టం చేస్తోంది. గత 12 ఏళ్లలో జన్‌ధన్ ఖాతాల సంఖ్య దాదాపు నాలుగు రెట్లు పెరిగింది. ప్రస్తుతం ఉన్న 59.09 కోట్ల ఖాతాల్లో 45.95 కోట్ల ఖాతాలు గ్రామీణ, పట్టణ శివారు ప్రాంతాల్లో ఉండగా, 13.14 కోట్ల ఖాతాలు పట్టణ, మహానగర ప్రాంతాల్లో ఉన్నాయి. బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేని ప్రజలను అధికారిక ఆర్థిక వ్యవస్థలోకి తీసుకురావడంలో పథకం గణనీయమైన ప్రగతిని సాధించింది.

### రూ.3.16 లక్షల కోట్లకు డిపాజిట్లు

జన్‌ధన్ ఖాతాల్లో ప్రజల పొదుపు కూడా భారీగా పెరిగింది. 2015 మార్చిలో రూ.15,670 కోట్లుగా ఉన్న డిపాజిట్లు 2026 ఆగస్టు 19 నాటికి రూ.3,16,514 కోట్లకు చేరాయి. దాదాపు 20 రెట్లు పెరిగిన ఈ డిపాజిట్లు, అల్పాదాయ కుటుంబాల్లో పొదుపు అలవాటు పెరుగుతున్న తీరును ప్రతిబింబిస్తున్నాయి. అధికారిక బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెరగడానికీ ఇది నిదర్శనంగా నిలుస్తోంది. జన్‌ధన్ యోజన మహిళల ఆర్థిక స్వావలంబనకు కూడా కీలక వేదికగా మారింది. 2026 ఆగస్టు 19 నాటికి మహిళా లబ్ధిదారుల సంఖ్య 32.92 కోట్లకు చేరింది. బ్యాంకు ఖాతాల ద్వారా ప్రభుత్వ ప్రయోజనాలు నేరుగా అందడం, పొదుపు చేయడం, డిజిటల్ చెల్లింపులు నిర్వహించడం, బీమా, పింఛను వంటి సేవలు పొందడం మహిళల ఆర్థిక భాగస్వామ్యాన్ని పెంచింది. జన్‌ధన్ ఖాతాదారులకు ఇప్పటివరకు 41.29 కోట్ల రూపే డెబిట్ కార్డులు జారీ చేశారు. ఈ కార్డుల ద్వారా నగదు ఉపసంహరణతోపాటు డిజిటల్ లావాదేవీలు నిర్వహించే అవకాశం కల్పించారు. దేశంలో డిజిటల్ చెల్లింపుల విస్తరణకు జన్‌ధన్ పథకం పరోక్షంగా బలమైన పునాది వేసిందని చెప్పవచ్చు.

### ప్రతి వయోజనుడికీ బ్యాంకింగ్ లక్ష్యం

ప్రారంభంలో ప్రతి కుటుంబానికి కనీసం ఒక బ్యాంకు ఖాతా అందించడంపై పీఎం-జేడీవై దృష్టి సారించింది. అనంతరం 2018లో బ్యాంకు ఖాతా లేని ప్రతి వయోజనుడిని బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావాలనే లక్ష్యంతో పథకం పరిధిని విస్తరించారు. ప్రాథమిక బ్యాంకింగ్ సేవలు, అవసరాల ఆధారిత రుణాలు, నగదు బదిలీలు, బీమా, పింఛను సదుపాయాలను ఈ పథకం ద్వారా అందిస్తున్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యే ప్రత్యక్ష ప్రయోజన బదిలీ విధానానికి కూడా జన్‌ధన్ ఖాతాలు కీలకంగా మారాయి. జన్‌ధన్ కింద చేపట్టిన విస్తృత ఆర్థిక సమ్మిళిత కార్యక్రమాన్ని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ 2015 జనవరిలో గుర్తించింది. భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం ఆధ్వర్యంలో సాగిన కార్యక్రమంలో ఒకే వారంలో 1,80,96,130 బ్యాంకు ఖాతాలు తెరవడం ద్వారా రికార్డు నెలకొల్పారు. భారత్‌లో ఆర్థిక సేవలను విస్తరించడంలో జన్‌ధన్ పథకం పోషించిన పాత్రకు అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు లభించింది. అధికారిక బ్యాంకింగ్ వ్యవస్థలోకి కోట్లాది మందిని తీసుకురావడంలో ఈ పథకం ప్రభావాన్ని అంతర్జాతీయ సంస్థలు కూడా ప్రముఖంగా ప్రస్తావించాయి.

### ముఖ్యాంశాలు:

- 59.09 కోట్లు - మొత్తం జన్‌ధన్ ఖాతాలు
- 32.92 కోట్లు - మహిళల ఖాతాలు
- 45.95 కోట్లు - గ్రామీణ, పట్టణ శివారు ప్రాంతాల ఖాతాలు
- రూ.3,16,514 కోట్లు - ఖాతాల్లో మొత్తం డిపాజిట్లు
- 41.29 కోట్లు - జారీ చేసిన రూపే డెబిట్ కార్డులు

### ఎవరెవరు ఖాతా తెరవవచ్చు?

భారత పౌరులందరూ పీఎం-జన్‌ధన్ ఖాతా తెరవడానికి అర్హులు. గరిష్ఠ వయోపరిమితి లేదు. బ్యాంకు ఖాతా లేని వ్యక్తులు ప్రాథమిక పొదుపు ఖాతాను తెరవవచ్చు. బ్యాంకు శాఖలో లేదా బ్యాంక్ మిత్ర కేంద్రంలో అవసరమైన కేవైసీ పత్రాలను సమర్పించి ఖాతా ప్రారంభించుకోవచ్చు. అర్హత నిబంధనలకు లోబడి ఉమ్మడి ఖాతా కూడా తెరవడానికి అవకాశం ఉంది. జన్‌ధన్ ఖాతాదారులు ప్రత్యక్ష ప్రయోజన బదిలీతోపాటు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పింఛను యోజన వంటి సామాజిక భద్రతా పథకాల ప్రయోజనాలను పొందే అవకాశాన్ని కల్పించారు. ముద్ర పథకం వంటి రుణ సదుపాయాలతో అనుసంధానం ద్వారా చిన్న వ్యాపారాలు, స్వయం ఉపాధికి కూడా మార్గం ఏర్పడింది. జన్‌ధన్ యోజన కేవలం బ్యాంకు ఖాతాల సంఖ్యను పెంచిన పథకం మాత్రమే కాదు. కోట్లాది భారతీయులకు అధికారిక ఆర్థిక గుర్తింపును కల్పించి, పొదుపు నుంచి బీమా వరకు, రుణాల నుంచి పింఛన్ల వరకు, నగదు బదిలీల నుంచి డిజిటల్ చెల్లింపుల వరకు అనేక ఆర్థిక అవకాశాలను చేరువ చేసిన జాతీయ కార్యక్రమం. పెరుగుతున్న ఖాతాలు, మహిళల భాగస్వామ్యం, డిపాజిట్ల వృద్ధి.. దేశ ఆర్థిక సమ్మిళిత ప్రస్థానంలో జన్‌ధన్ యోజన బలమైన పునాదిగా నిలిచిందనడానికి నిదర్శనం.

### జన్‌ధన్ ఖాతా ప్రయోజనాలు

- **సున్నా కనిష్ఠ నిల్వ:** ఖాతాలో కనిష్ఠ మొత్తం ఉంచాల్సిన అవసరం లేదు.
- **రూపే డెబిట్ కార్డు:** నగదు ఉపసంహరణ, డిజిటల్ చెల్లింపులకు ఉపయోగపడుతుంది.
- **ప్రమాద బీమా:** అర్హత నిబంధనల మేరకు రూ.2 లక్షల వరకు ప్రమాద బీమా రక్షణ.
- **ఓవర్‌డ్రాఫ్ట్:** అర్హత కలిగిన వారికి రూ.10 వేల వరకు ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయం.
- **డీబీటీ:** ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నేరుగా ఖాతాలో జమ.
- **సామాజిక భద్రత:** బీమా, పింఛను వంటి పథకాలతో అనుసంధానానికి అవకాశం.

# కిలో ఉల్లి రూ.35

### దేశంలో కొరత లేదు: కేంద్రం



న్యూఢిల్లీ: దేశంలో ఉల్లిపాయల కొరత ఏమాత్రం లేదని, వినియోగదారులకు ఉపశమనం కల్పించేందుకు ధరల స్థిరీకరణ నిధి నుంచి కిలో ఉల్లిని రూ. 35కే విక్రయిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రకటించింది. పెరుగుతున్న ధరల నుంచి సామాన్యులను కాపాడే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టినట్లు స్పష్టం చేసింది. వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి నిధి ఖరే ఢిల్లీలోని కృషి భవన్‌లో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు. తొలుత నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్, కేంద్రీయ భండార్‌ల ఔట్‌లెట్లు, మొబైల్ వ్యాన్ల ద్వారా ఈ విక్రయాలు జరుపుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిధి ఖరే మీడియాతో మాట్లాడుతూ, "దేశంలో ఉల్లి ఉత్పత్తికి గానీ, లభ్యతకు గానీ ఎలాంటి కొరత లేదు. వినియోగదారులను ఆకస్మిక ధరల పెరుగుదల నుంచి కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. గతేడాదితో పోలిస్తే ఈసారి ఉల్లి ఎగుమతులు కూడా దాదాపు అదే స్థాయిలో ఉన్నాయి" అని వివరించారు. నాఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ అగర్వాల్ మాట్లాడుతూ, ఢిల్లీ వ్యాప్తంగా 40 ప్రాంతాల్లో మొబైల్ వ్యాన్ల ద్వారా ఉల్లి అమ్మకాలు ప్రారంభించినట్లు ఐఏఎన్ఎస్‌కు తెలిపారు. ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్స్, రిటైల్ చైన్‌ల ద్వారా కూడా విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అలాగే, ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) దుకాణాల ద్వారా కూడా రూ. 35కే ఉల్లిని అందుబాటులోకి తెచ్చేందుకు ఢిల్లీ ప్రభుత్వంతో చర్చిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఎన్‌సీసీఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ అనీస్ జోసెఫ్ చంద్ర మాట్లాడుతూ, కార్యక్రమం ప్రారంభమైన వెంటనే తమ రిటైల్ కేంద్రాల్లో ఉల్లి అమ్మకాలు మొదలుపెట్టామని చెప్పారు. ముఖ్యంగా మెట్రో స్టేషన్ల సమీపంలోని ఎన్‌సీసీఎఫ్ ఔట్‌లెట్లలో వినియోగదారులు రూ. 35కే ఉల్లిని కొనుగోలు చేయవచ్చని ఆమె తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత ఎక్కువ మంది వినియోగదారులకు ప్రయోజనం చేకూరేలా ఈ నెట్‌వర్క్‌ను విస్తరిస్తామని హామీ ఇచ్చారు.

## భారత్ సాయం మరువలేనిది: బాలేన్ షా

ఖట్మండు: టిబెట్ సరిహద్దు ప్రాంతంలో ఊహించని విధంగా వచ్చిన ఆకస్మిక వరదల వల్ల నేపాల్ తీవ్రంగా నష్టపోయింది. భోటేకోశి నదిలో నీటిమట్టం ఒక్కసారిగా పెరిగి గ్రామాలు, ప్రాజెక్టు సైట్లు, వంతెనలు కొట్టుకుపోవడంతో పెద్ద సంఖ్యలో మృతి చెందగా, వందలాది మంది గల్లంతయ్యారు. ఈ దారుణ విపత్తుపై నేపాల్ ప్రధాని బాలేంద్ర బాలేన్ షా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది దేశం ఎన్నడూ చూడని రీతిలో సంభవించిన ఘోర విపత్తు అని ఆయన అభివర్ణించారు. బాధితుల రక్షణ, సహాయక చర్యల కోసం నేపాల్ ఆర్మీ, సాయుధ పోలీసు బలగాలు, విపత్తు నిర్వహణ బృందాలు పూర్తిస్థాయిలో రంగంలోకి దిగాయని వెల్లడించారు. వరదల్లో చిక్కుకున్న ప్రజలను రక్షించేందుకు ఆర్మీ హెలికాప్టర్ల ద్వారా విరామం లేకుండా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే రసువా జిల్లాలోని తిమురే ప్రాంతం నుంచి 21 మంది భారతీయులతో సహా 116 మందిని నేపాల్ ఆర్మీ సురక్షితంగా బయటకు తీసుకొచ్చిందని తెలిపారు. బాధితులకు ఆహారం, తాత్కాలిక నివాసం, వైద్య సహాయం అందించేందుకు ప్రభుత్వం తన వద్ద ఉన్న పూర్తి యంత్రాంగాన్ని వినియోగిస్తోందని భరోసా ఇచ్చారు. ఈ క్లిష్ట సమయంలో భారత్ సహా అంతర్జాతీయ దేశాలు సహాయం అందించేందుకు ముందుకు వచ్చినట్లు ప్రధాని తెలిపారు.

## చాట్‌జీపీటీలోనూ యాడ్స్

న్యూయార్క్: చాట్‌జీపీటీ యూజర్లకు ఇకపై ప్రకటనలు కనిపించనున్నాయి. భారత్‌లో 'చాట్‌జీపీటీ యాడ్స్'ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఓపెన్‌ఏఐ ప్రకటించింది. 'ఫ్రీ', 'గో' ప్లాన్లలో ఉన్న లాగిన్ అయిన వయోజన యూజర్లకు ఈ ప్రకటనలు కనిపిస్తాయి. భారత్‌లో 'గో' ప్లాన్ నెలకు రూ.399గా ఉంది. చాట్‌జీపీటీ సమాధానం దిగువ భాగంలో స్పాన్సర్డ్ ఉత్పత్తులు, సేవలకు సంబంధించిన ప్రకటనలు కనిపిస్తాయి. వీటిని స్పష్టంగా 'యాడ్'గా గుర్తిస్తారు. చాట్‌జీపీటీ ఇచ్చే సమాధానాల నుంచి ప్రకటనలను ప్రత్యేకంగా చూపిస్తామని ఓపెన్‌ఏఐ తెలిపింది. ప్లస్, ప్రో, బిజినెస్, ఎంటర్‌ప్రైజ్, ఎడ్యుకేషన్ ప్లాన్లలో ఉన్న వారికి ప్రకటనలు ఉండవు. యూజర్ల ప్రైవసీకి ఎలాంటి ఇబ్బంది ఉండదని ఓపెన్‌ఏఐ స్పష్టం చేసింది. యూజర్ల చాట్స్, చాట్ హిస్టరీ, మెమరీస్, వ్యక్తిగత వివరాలను ప్రకటనదారులు చూడలేరని తెలిపింది. యూజర్ల డేటాను ప్రకటనదారులకు విక్రయించబోమని పేర్కొంది. ప్రకటనల పనితీరుకు సంబంధించిన మొత్తం గణాంకాలు మాత్రమే ప్రకటనదారులకు అందుతాయి.


## ఆరెస్సెస్‌లోనే 'జెన్-జీ' ఎక్కువ

**బీజేపీ నేత రామ్ మాధవ్**

ఖట్మండు: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) దేశంలోనే అత్యంత శక్తిమంతమైన యువజన సంస్థ అని, 'జెన్-జీ'గా పిలుస్తున్న నేటి తరం యువత అందులోనే అత్యధిక సంఖ్యలో ఉన్నారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు రామ్ మాధవ్ పేర్కొన్నారు. నేపాల్ రాజధాని ఖట్మండులో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా రామ్ మాధవ్ మాట్లాడుతూ, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలు తెలిపేవారే జెన్-జీ యువత కాదని, ఆ పదాన్ని ఒక వర్గానికే పరిమితం చేయకూడదని అభిప్రాయపడ్డారు. 'జెన్-జీ'గా వ్యవహరిస్తున్న యువత ఆర్ఎస్ఎస్‌తో పాటు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ)లోనూ పెద్ద సంఖ్యలో ఉన్నారని ఆయన వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి భారతీయ జనతా యువమోర్చా ద్వారా యువత నుంచి భారీ మద్దతు లభిస్తోందని తెలిపారు. "జెన్-జీ, మిలీనియల్స్, జెన్ ఆల్ఫా వంటి కొత్త పదజాలంతో మన యువతను ఎంతగా విభజించాలనుకుంటున్నారు?" అని ఆయన ప్రశ్నించారు. ఈ తరహా లేబుల్స్ వాడకంపై అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. గత నెల ఢిల్లీలో జరిగిన యువత నిరసనల గురించి ప్రస్తావిస్తూ, ప్రభుత్వం వారి సమస్యలను వెంటనే పరిష్కరించిందని, ఆ నిరసనల లక్ష్యం నెరవేరిందని చెప్పారు. ఆ నిరసనల్లో జెన్-జీ కాని ఇతర వర్గాలు కూడా పాల్గొన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, నేపాల్‌లోని యువత ఉద్యమాలతో భారత్‌లోని పరిస్థితులను పోల్చడానికి ఆయన నిరాకరించారు. అది పూర్తిగా నేపాల్ అంతర్గత వ్యవహారమని, దానిపై బయటివారు వ్యాఖ్యానించడం సరికాదని రామ్ మాధవ్ స్పష్టం చేశారు.

## చైనా యూట్యూబ్.. బిలిబిలి

బీజింగ్: యూట్యూబ్‌కు పోటీగా అంతర్జాతీయ మార్కెట్లోకి విస్తరించేందుకు చైనా వీడియో షేరింగ్ వేదిక 'బిలిబిలి' ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ క్రమంలో కంటెంట్ క్రియేటర్లకు భారీగా చెల్లింపులు అందించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. 1,000 వ్యూస్‌కు 0.70 డాలర్లు అంటే దాదాపు రూ.60 వరకు చెల్లించే అవకాశం ఉందని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. అయితే ఈ చెల్లింపు వివరాలను 'బిలిబిలి' అధికారికంగా ధ్రువీకరించలేదు. చైనాలో యూట్యూబ్‌కు ప్రత్యామ్నాయంగా గుర్తింపు తెచ్చుకున్న బిలిబిలి ఇప్పుడు పశ్చిమ దేశాల్లోకి అడుగులు వేస్తోంది. అంతర్జాతీయ వెర్షన్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేయనున్నట్లు సంస్థ తెలిపింది. తప్పనిసరి గుర్తింపు ధ్రువీకరణ లేకుండానే ఖాతా తెరిచే అవకాశం కల్పించనుంది. విదేశీ వినియోగదారులకు అనుగుణంగా కొత్త ఫీచర్లు, స్థానికీకరించిన అనుభవాన్ని అందించనుంది. బిలిబిలి చెల్లింపులపై సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. స్పానిష్ భాషా ఖాతా 'ఎల్ డుయ్' ఈ విషయాన్ని 'ఎక్స్'లో ప్రస్తావించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రియేటర్లను ఆకర్షించేందుకు అంతర్జాతీయ మానిటైజేషన్ అవకాశాలను బిలిబిలి అందిస్తోందని పేర్కొంది. ఆ పోస్టుకు 16 వేలకు పైగా లైక్‌లు వచ్చాయి. 2009లో ప్రారంభమైన బిలిబిలికి ప్రస్తుతం 35 కోట్లకు పైగా నెలవారీ యూజర్లు ఉన్నట్లు సమాచారం. అంతర్జాతీయ క్రియేటర్లు కూడా ఈ వేదికపై ఇప్పటికే తమ ఉనికిని చాటుతున్నారు. ప్రముఖ యూట్యూబర్ మిస్టర్‌బీస్ట్ 2024లో బిలిబిలిలో కంటెంట్ పెట్టడం ప్రారంభించారు. ప్రస్తుతం ఆయనకు 88 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. అయితే యూట్యూబ్‌తో పోలిస్తే బిలిబిలి ప్రకటనల వ్యవస్థ, క్రియేటర్ ఫండ్ ఇంకా చిన్న స్థాయిలోనే ఉన్నట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఎక్కువ వ్యూస్ వచ్చినా అందరికీ భారీ ఆదాయం వస్తుందనే హామీ లేదని సూచిస్తున్నారు.



లవ్లీ చిత్రం


శృతి చౌహాన్




## సినిమా నచ్చకపోతే గుండు కొట్టించుకుంటా

'సాహో: లైఫ్ ఆఫ్ సంజు' అనే సినిమా హీరోయిన్ శ్వేత లక్ష్మణ్ ఎవరు ఉహించని ఛాలెంజ్ చేశారు. సినిమా చూసి బయటకు వచ్చిన తర్వాత ఎవరైనా డిజప్పాయింట్ అయితే అమీర్‌పేట్ సెంటర్‌లో నిలబడి గుండు కొట్టించుకుంటానంటూ ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ట్రైలర్ లాంచ్ సందర్భంగా నిర్వహించిన ప్రెస్ మీట్ లో ఆమె మాట్లాడిన తీరుకు అందరూ షాక్ అయ్యారు. సెప్టెంబర్ 4న విడుదల కాబోతున్న 'సాహో' ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో శ్వేత ఈ కామెంట్స్ చేశారు. ప్రేక్షకులను సినిమా చూడమని తాను రిక్వెస్ట్ చేయడం లేదని, నేరుగా ఛాలెంజ్ చేస్తున్నానని అన్నారు. అంత గట్టిగా ఈ కథను నమ్ముతున్నానని, సినిమా చూసిన తర్వాత మంచి ప్రయత్నం చేశారని ప్రేక్షకులే చెబుతారని ధీమాగా మాట్లాడారు. ఈ సినిమా వెనుక పెద్ద బడ్జెట్, స్టార్ కాస్ట్ ఏమీ లేదని శ్వేత చెప్పుకొచ్చారు. కథను నమ్ముకుని కొత్తవాళ్లతో ఈ ప్రయాణం మొదలుపెట్టామని.. ప్రేమ అంటే కేవలం పాటలు, సరదా మాత్రమే కాదని, అందులో బాధ, త్యాగం, కొన్ని కఠినమైన నిర్ణయాలు కూడా ఉంటాయని తెలిపారు. జీవితాన్ని మార్చే ఒక నిర్ణయం చుట్టూ 'సాహో' కథ సాగుతుందని వివరించారు. ఈ సందర్భంగా బన్నీ వాసు, వంశీ నందిపాటికి కూడా ఆమె ప్రత్యేకంగా థ్యాంక్స్ చెబుతూ.. కొత్తవాళ్లు చేసిన సినిమాను గుర్తించి అండగా నిలబడటం తమ టీమ్‌కు ఎంతో ధైర్యం ఇచ్చిందని అన్నారు.

## నా మీదే కోపం: విష్ణుప్రియ

అల్లరి నరేష్ హీరోగా తెరకెక్కిన సోషియో ఫాంటసీ మూవీ రంభ ఊర్వశి మేనక సెప్టెంబర్ 4న విడుదల కాబోతోంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా నిర్వహించిన టైటిల్ సాంగ్ లాంచ్ ఈవెంట్ లో హీరోయిన్లు మీడియాతో ఇంటరాక్ట్ అయ్యారు. ఈ క్రమంలో నటి విష్ణుప్రియ తన పాత్ర, సినిమా కథాంశంపై చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. సినిమా డబ్బింగ్ సమయంలో తెరపై తన నటనను చూసుకున్నప్పుడు కొన్ని చోట్ల కోపం వచ్చిందని విష్ణుప్రియ ఓపెన్ గా చెప్పారు. ఏంటి ఇలా చేశాను, ఆ షాట్ లో అలా నించున్నాను ఏంటి, ఇంకా బాగా చేయొచ్చు కదా అని తన మీద తనకే అసహనం కలిగిందని ఆమె వివరించారు. నటిగా ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉందని ఆమె తన పెర్ఫార్మెన్స్ గురించి వివరణ ఇచ్చారు. గతంలో వచ్చిన సోషియో ఫాంటసీ సినిమాల్లో రంభ, ఊర్వశి, మేనక పాత్రలు కేవలం ఒక పాటకు లేదా చిన్న సన్నివేశానికి మాత్రమే పరిమితం అయ్యేవని



ఆమె గుర్తుచేశారు. కానీ ఈ చిత్రంలో పూర్తిగా ఆ ముగ్గురు దేవకన్యల చుట్టూనే కథ సాగుతుందని ఆమె స్పష్టం చేశారు. వాళ్లు భూమి మీదకు వస్తే ఎదురయ్యే ఫన్ నేపథ్యంలో ఇలాంటి పూర్తిస్థాయి సినిమా ఇప్పటివరకు రాలేదని ఆమె అభిప్రాయపడ్డారు. జనరేషన్స్ మారుతున్నా ఈ సినిమాలోని కామెడీ అందరికీ కనెక్ట్ అవుతుందని విష్ణుప్రియ నమ్మకం వ్యక్తం చేశారు

## ఫోర్బ్స్ ఇండియా కవర్ పేజీపై బన్నీ

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ క్రేజ్ మరోసారి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. తాజాగా అంతర్జాతీయంగా ఎంతో పేరున్న 'ఫోర్బ్స్ ఇండియా' ప్రతిష్టాత్మక కవర్ పేజీపై అల్లు అర్జున్ చోటు దక్కించుకుని అరుదైన గౌరవాన్ని పొందారు. ప్రత్యేకంగా రూపొందించిన 'షోస్టాపర్స్' ఎడిషన్‌లో కవర్ స్టార్‌గా నిలిచిన బన్నీ.. తన పెరుగుతున్న పాన్ ఇండియా ఇమేజ్, సినిమాల ప్రస్తుత పరిస్థితిపై కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దాంతో ఆయన చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో రికార్డులు సృష్టిస్తున్న ప్రముఖ నటులు, క్రీడాకారులు, సింగర్స్ మరియు ఆర్టిస్టులతో ఫోర్బ్స్ ఇండియా 'షోస్టాపర్స్' పేరుతో ప్రత్యేక సంచికను తీసుకొచ్చింది. ఇక ఈ మ్యాగజైన్ కవర్ పేజీపై అల్లు అర్జున్ నిలవడం విశేషం. సెలబ్రిటీల బ్రాండ్ బిల్డింగ్ ప్రయాణం, వారు ఎదుర్కొన్న సవాళ్లు, తమకంటూ ప్రత్యేకమైన గుర్తింపును ఎలా సాధించారనే కథనాలతో ఈ ఎడిషన్ రూపొందింది. ఇక ఇందులో బన్నీకి కవర్ స్టార్‌గా చోటు దక్కడం ఆయన నేషనల్ స్టేచర్‌కు అద్దం పడుతోంది.






## పెళ్లి కాదు.. షూటింగే: జాన్వీ కపూర్

ఉన్నట్టుండి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారిపోయింది బాలీవుడ్ స్టార్ బ్యూటీ జాన్వీ కపూర్. బాలీవుడ్ యంగ్ హీరో ఇషాన్ కట్టర్‌ను జాన్వీ పెళ్లి చేసుకున్నట్లు కొన్ని వీడియోలు, ఫొటోలు నెట్టింట సంచలనంగా మారాయి. దీంతో జాన్వీ కపూర్ రహస్యంగా పెళ్లి చేసేసుకుంది అంటూ బాలీవుడ్, టాలీవుడ్ మీడియాల్లో వార్తలు ఒక్కసారిగా ఊపందుకున్నాయి. ఈ విషయం కాస్త వైరల్ కావడంతో దీనిపై స్పందించిన సంబంధిత బ్రాండ్ నిర్వాహకులు ఆ పుకార్లకు చెక్ పెట్టారు. 'అవి పెళ్లికి సంబంధించిన ఫొటోలు కావు.. 'కల్కి బ్రైడ్ అండ్ గ్రూమ్ కోచర్ '26' బ్రాండ్ ప్రమోషనల్ షూట్‌లో భాగం' అని క్లారిటీ ఇచ్చారు.



## ప్రతి పైసా నా కష్టార్జితమే: కొమురం

కొమరక్కగా పాప్యులర్ అయిన కొమురం గురించే ఇప్పుడు అంతా మాట్లాడుకుంటున్నారు. 'ఇరుముడి' సినిమాలో ఆయన పోషించిన 'నాగులు' పాత్ర ఆడియన్స్ కి బాగా కనెక్ట్ అయింది. ఈ నేపథ్యంలో తాజాగా 'సుమన్ టీవీ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో కొమురం తన గురించిన అనేక విషయాలను గురించి ప్రస్తావిస్తూ వెళ్లాడు. "మేము షాద్ నగర్ దగ్గరలో ఉంటాము. మా ఇల్లు .. పొలాలు అక్కడే ఉంటాయి. ఒకప్పుడు ఒక దొర ఉన్న ఇల్లునే మేము కొనుక్కున్నాము" అని చెప్పాడు. " నటుడిగా నేను జబర్దస్త్ లో పేరు తెచ్చుకున్నా .. సినిమాలు చేస్తున్నా మా అమ్మ ఇప్పటికీ కూరగాయలు అమ్ముతూనే ఉంటుంది. ఒక్కోరోజు ఒక్కో సంతలో ఆమె కూరగాయలు అమ్ముకుని వస్తుంటుంది. మా నాన్న .. మా అన్నయ్య .. నేను కూడా వ్యవసాయం చేస్తాము. మాకు ఒక 40 బర్రెలు ఉన్నాయి. నేను కూడా పాలుపితుకుతూనే ఉంటాను. కష్టపడి పనిచేయడంలో సంతృప్తి ఉంటుంది.

## రకుల్ చెప్పిన శూర్పణఖ కథ

రామాయణంలో శూర్పణఖ అంటే చాలామందికి వెంటనే గుర్తుకొచ్చేది ప్రతినాయకురాలి పాత్రే. కానీ, 'రామాయణ' చిత్రంలో తాను పోషిస్తున్న శూర్పణఖ పాత్రలో అంతకుమించిన కోణాలున్నాయని నటి రకుల్ ప్రీత్ సింగ్ చెప్పింది. ఆ పాత్రలోని అనేక అంశాలు తనను ఈ సినిమా వైపు ఆకర్షించాయని తెలిపింది. రావణుడి సోదరిగా శూర్పణఖ పాత్రలో రకుల్ కనిపించనుంది. లంకలో అత్యంత అందమైన మహిళల్లో ఆమె ఒకరని చెబుతారని రకుల్ గుర్తుచేసుకుంది. ఆమెకు అహంకారం ఉన్నప్పటికీ.. పాత్రలో చాలా కోణాలున్నాయని చెప్పింది. నటిగా అలాంటి పాత్రలను ఆవిష్కరించడం ఆసక్తికరంగా ఉంటుందని తెలిపింది. స్క్రిప్ట్ చదివే వరకు శూర్పణఖ జీవితం గురించి తనకు తెలియని విషయాలు చాలానే ఉన్నాయని రకుల్ చెప్పింది. లక్ష్మణుడు ఆమె ముక్కు కోసిన ఘటనకు ముందు, తర్వాత జరిగిన పరిణామాలను సినిమాలో కొత్త కోణంలో చూపిస్తున్నట్లు వెల్లడించింది. రాముడిని శూర్పణఖ ఎలా కలుస్తుందన్న విషయాల్లోనూ కొత్త అంశాలు తెలుసుకున్నానని తెలిపింది.


## సన్నీ లియోన్‌కు ఊరట



బాలీవుడ్ నటి సన్నీ లియోన్‌కు తాజాగా భారీ ఊరట లభించింది. సన్నీ లియోన్, ఆమె భర్త డేనియల్‌పై నమోదైన చీటింగ్ కేసును బాంబే హై కోర్టు కొట్టేసింది. తెలుగు సినిమా విషయంలో రూ. 70 లక్షలకు పైగా కమీషన్ బకాయి పెట్టారంటూ ఓం ప్రకాశ్ జైన్ చేసిన ఆరోపణలపై ఈ పిటిషన్ దాఖలైంది. ఈ వ్యవహారంలో మోసం, నమ్మకద్రోహం, క్రిమినల్ బెదిరింపులకు పాల్పడ్డారంటూ జైన్ పేర్కొన్న ఫిర్యాదును 2024లో మేజిస్ట్రేట్ కోర్టు తిరస్కరించింది. దీంతో ఆయన సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. అయితే.. ఈ వ్యవహారం వాణిజ్య లావాదేవీకి సంబంధించినదేనని అదనపు సెషన్స్ జడ్జి పి.ఏ.సానే తెలిపారు. కేవలం చెల్లింపులు జరగకపోవడం వల్లే మోసం లేదా నమ్మకద్రోహం నేరాలు నిర్ధారించలేమని స్పష్టం చేసింది. మొదటి నుంచే మోసం చేసినట్లు ఆధారాలు ఉంటేనే వాణిజ్య వివాదం, క్రిమినల్ నేరంగా పరిగణించవచ్చని పేర్కొంటూ జైన్ రివిజన్ పిటిషన్‌ను కొట్టేసింది.

## అక్టోబర్ 16న రణబాలి రిలీజ్

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ తెరకెక్కిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' విడుదల తేదీ మారింది. ఈ చిత్రాన్ని తొలుత సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావించిన మేకర్స్.. ఇప్పుడు అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. మైత్రీ మూవీ మేకర్స్ గురువారం సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని వెల్లడించింది. "మన చరిత్రలోని చీకటి అధ్యాయం ఈ అక్టోబర్‌లో తెరుచుకోనుంది" అంటూ అక్టోబర్ 16న 'రణబాలి' గ్రాండ్ రిలీజ్ ఉంటుందని ప్రకటించింది. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ 'రణబాలి' పాత్రలో కనిపించనుండగా.. రష్మిక మందన్న అతడి భార్య జయమ్మగా నటిస్తోంది. 'ది మమ్మీ' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న ఆర్నాల్డ్ వోస్లూ ఇందులో ప్రతినాయకుడు 'సర్ థియోడోర్ హెక్టర్'గా కనిపించనున్నారు.








# డ్రా..!

### సోనల్ దినుష అద్భుత శతకం

**శ్రీలంకతో సిరీస్‌ను 1-0తో గెలుచుకున్న భారత్**

## డబ్ల్యూటీసీ పట్టికలో 5వ స్థానంలోనే టీమిండియా

శ్రీలంకతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌ను భారత్ 1-0 తేడాతో కైవసం చేసుకుంది. అయితే, ఈ విజయం టీమిండియాకు పూర్తిస్థాయి ఆనందాన్ని ఇవ్వలేకపోయింది. కొలంబో వేదికగా జరిగిన రెండో టెస్టు డ్రాగా ముగియడంతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ రేసులో భారత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఈ డ్రా కారణంగా విలువైన పాయింట్లు కోల్పోయిన శుభ్‌మన్ గిల్ సేన, పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలోనే నిలిచిపోయింది. సిరీస్ గెలిచినప్పటికీ, పట్టికలో పురోగతి సాధించలేకపోవడం జట్టును నిరాశపరిచింది. రెండో టెస్టు ప్రారంభానికి ముందు 53.33 పాయింట్ల శాతంతో (పీసీటీ) ఉన్న భారత్, ఈ డ్రా ఫలితంతో 51.52 శాతానికి పడిపోయింది. ప్రస్తుతం డబ్ల్యూటీసీ పట్టికలో 2023 విజేత ఆస్ట్రేలియా (80%), 2025 విజేత దక్షిణాఫ్రికా (75%), 2021 ఛాంపియన్ న్యూజిలాండ్ (72.22%), బంగ్లాదేశ్ (55.56%) తొలి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. వారి తర్వాత భారత్ ఐదో స్థానంలో కొనసాగుతోంది. మరోవైపు, ఈ మ్యాచ్‌ను విజయవంతంగా డ్రా చేసుకున్న శ్రీలంక 33.33 పీసీటీతో ఆరో స్థానంలో ఉంది. ఎస్ఎస్‌సీ మైదానంలో జరిగిన రెండో టెస్టులో చివరి రోజు భారత్ గెలుపు ఖాయమనిపించింది. కానీ, శ్రీలంక బ్యాటర్ సోనల్ దినుష (133 నాటౌట్) అద్భుతమైన పోరాట పటిమతో వీరోచిత శతకం బాది టీమిండియా ఆశలపై నీళ్లు చల్లాడు. 16 పరుగుల స్వల్ప ఆధిక్యంతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన లంక, తొలి సెషన్‌లోనే వికెట్ నష్టపోకుండా 100 పరుగులు జోడించింది. దినుషకు కేశర నువంత (46) చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరూ తొలి వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. భోజన విరామం తర్వాత మానవ్ సుతార్, రవీంద్ర జడేజా చెరో వికెట్ పడగొట్టినా, క్రీజులో పాతుకుపోయిన దినుష పట్టు వదల్లేదు. లహిరు కుమారతో కలిసి మ్యాచ్‌ను డ్రా దిశగా నడిపించాడు. భారత బౌలర్లు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. చివరికి కెప్టెన్ శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ వంటి పార్ట్‌టైమ్ బౌలర్లు బౌలింగ్ చేశారంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. చివరకు ఇరుజట్ల కెప్టెన్ల అంగీకారంతో మ్యాచ్‌ను డ్రాగా ముగించారు. ఇప్పటికే తమ డబ్ల్యూటీసీ సైకిల్‌లో దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్‌తో సిరీస్‌లు పూర్తి చేసుకున్న భారత్‌కు రాబోయే సిరీస్‌లు అత్యంత కీలకం కానున్నాయి. ఈ ఏడాది నవంబర్‌లో న్యూజిలాండ్‌తో వారి గడ్డపై రెండు టెస్టులు, ఆ తర్వాత స్వదేశంలో ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్ ఆడనుంది. డబ్ల్యూటీసీ ఫైనల్‌కు అర్హత సాధించాలంటే ఈ సిరీస్‌లలో అసాధారణ ఆటతీరుతో అత్యుత్తమ ప్రదర్శన కనబరచడం టీమిండియాకు తప్పనిసరి.

### టెస్టు క్రికెట్ గెలిచింది: గిల్

టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ.. తమ వ్యూహాల్లో ఎలాంటి పొరపాటు లేదని స్పష్టం చేశాడు. "నిజాయతీగా చెప్పాలంటే, మేం చేయగలిగిందంతా చేశాం. మూడు రోజుల పాటు ఫీల్డింగ్ చేశాం. కానీ లంక బ్యాటర్లు అద్భుతంగా ఆడారు. వారికి కొద్దిగా అదృష్టం కూడా కలిసొచ్చింది" అని గిల్ అన్నాడు. ఫాలో-ఆన్ నిర్ణయంపై మాట్లాడుతూ.. "జరిగిపోయిన తర్వాత దేని గురించైనా మాట్లాడొచ్చు. కానీ ఆ క్షణంలో ఏది ఉత్తమమనిపిస్తుందో ఆ నిర్ణయమే తీసుకుంటాం. ఈరోజు టెస్ట్ క్రికెట్ గెలిచింది" అని వ్యాఖ్యానించాడు.






## హాకీ.. మహిళలు దుమ్ముదులిపారు!



హాకీ వరల్డ్ కప్-2026ను భారత మహిళల జట్టు విజయంతో ముగించింది. గురువారం జర్మనీతో జరిగిన మ్యాచ్‌లో 3-1 తేడాతో గెలుపొందింది. రెండో రౌండ్‌లో టీమిండియా సెమీస్ అవకాశాలను గల్లంతు చేసుకున్న విషయం తెలిసిందే. ఐదో స్థానం కోసం జర్మనీతో జరిగిన మ్యాచ్‌లో భారత అమ్మాయిలు అదరగొట్టారు. ఆరంభంలో మ్యాచ్ హోరాహోరీగా సాగింది. ఫస్టాఫ్‌లో ఏ జట్టూ గోల్ చేయలేకపోయింది. జర్మనీకి పలుమార్లు పెనాల్టీ కార్నర్‌లు దక్కినా వాటిని గోల్స్‌గా మల్చడంలో విఫలమైంది. ఇక సెకండాఫ్‌లో భారత్ దూకుడు పెంచింది. 43వ నిమిషంలో ఇషికా ఇండియాకు తొలి గోల్ అందించింది. ఆ మరుసటి నిమిషంలోనే నవ్‌నీత్ కౌర్ గోల్ చేసి భారత్ ఆధిక్యాన్ని 2-0కు పెంచింది. 47వ నిమిషంలో నవ్‌నీత్ నుంచి మరో గోల్ నమోదైంది. దీంతో భారత్ 3-0తో మ్యాచ్‌పై పట్టు బిగించడంతో జర్మనీపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. 59వ నిమిషంలో ఆ జట్టు ఏకైక గోల్ చేయడం మినహా పెద్దగా ప్రభావం చూపలేదు. ఆఖర్లో భారత గోల్‌కీపర్ సవిత జర్మనీ చేసిన రెండు గోల్ ప్రయత్నాలను తిప్పికొట్టింది. దీంతో భారత్ 3-1 తేడాతో విజయం సాధించింది. ఈ ప్రపంచకప్‌ను భారత్ 5వ స్థానంతో ముగించింది. 52 ఏళ్లలో వరల్డ్ కప్‌లో ఇండియాకు ఇదే అత్యుత్తమ ప్రదర్శన. 1974లో భారత జట్టు సెమీస్ వరకూ వెళ్లింది. ఆ తర్వాత ఇదే బెస్ట్ పర్ఫామెన్స్. ఈ ప్రపంచకప్‌లో ఆరు మ్యాచ్‌లు ఆడిన ఇండియా రెండు విజయాలు, మూడు డ్రాలు నమోదు చేసింది. ఒక్క మ్యాచ్‌లో మాత్రమే ఓడిపోయింది.



## క్రీడలతో డ్రగ్స్‌కు దూరంగా: తిలక్ వర్మ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ యువత, క్రీడాకారులతో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో టీమిండియా టీ20 వైస్ కెప్టెన్ తిలక్ వర్మ కూడా పాల్గొన్నాడు. 'ఖేలో ఇండియా డైలాగ్' పేరిట జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ ఇచ్చిన సందేశంపై ఈ డాషింగ్ బ్యాటర్ ప్రశంసలు కురిపించాడు. క్రీడల ద్వారా యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండవచ్చని, 2036 ఒలింపిక్స్‌లో మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ప్రధాని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఛత్తీస్‌గఢ్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమ ప్రసారానికి హాజరైన తిలక్ వర్మ, అనంతరం మీడియాతో మాట్లాడాడు. "ఇది చాలా మంచి కార్యక్రమం. ప్రధాని మోదీ యువతకు బలమైన సందేశాన్ని ఇచ్చారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండటం అత్యవసరం. ఇలాంటి కార్యక్రమాలు యువతను చెడు మార్గాల నుంచి దూరం చేయడానికి ఎంతగానో దోహదపడతాయి" అని అన్నాడు. తాను గతంలో క్రికెట్ ఆడేందుకు ఛత్తీస్‌గఢ్‌కు వచ్చానని, ఇక్కడ క్రీడలకు మంచి భవిష్యత్తు ఉందని అభిప్రాయపడ్డాడు. ఈ వర్చువల్ సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. యువతను డ్రగ్స్ మహమ్మారి నుంచి కాపాడటంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని నొక్కిచెప్పారు. "నిజమైన క్రీడాకారులు ఎప్పుడూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలనే తపనతో ఉంటారు. నేడు యువత డ్రగ్స్ అనే పెను సవాలును ఎదుర్కొంటున్న తరుణంలో, క్రీడలు వారికి రక్షణ కవచంలా నిలుస్తాయి" అని పేర్కొన్నారు.

## పెళ్లికి చేసుకోబోతున్న బోల్ట్



ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన రన్నర్, ఒలింపిక్ లెజెండ్ ఉసేన్ బోల్ట్ త్వరలోనే పీటలెక్కబోతున్నారు. దాదాపు పదేళ్లకు పైగా ప్రేమలో ఉన్న తన ప్రేయసి కాసీ బెన్నెట్‌తో ఆయన ఎంగేజ్మెంట్ నిశ్చయమైంది. తమ ముగ్గురు పిల్లల సమక్షంలో, బోల్ట్ 40వ జన్మదిన వేడుకల్లో మోకాలిపై కూర్చొని గ్రాండ్‌గా సర్ ప్రైజ్ ప్రపోజల్ చేశారు. ఈ ఎమోషనల్ అండ్ బ్యూటిఫుల్ మూమెంట్ ఫొటోలు ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా వైరల్ అవుతున్నాయి.. బర్త్‌డే పార్టీ కాస్తా ఎంగేజ్మెంట్ వేడుకగా: జమైకాలోని కింగ్‌స్టన్ వేదికగా జరిగిన ఉసేన్ బోల్ట్ 40వ జన్మదిన వేడుకలు ఊహించని మలుపు తిరిగాయి. చెక్ సూట్ ధరించిన బోల్ట్, మైక్ పట్టుకుని అందరి ముందూ మోకాలిపై కూర్చుని కాసీ బెన్నెట్‌కు ఐదు క్యారట్ల వజ్రపు ఉంగరాన్ని అందిస్తూ ప్రపోజ్ చేశారు. ఇక ఈ సర్ ప్రైజ్‌తో కాసీ బెన్నెట్ ఆనందంలో మునిగిపోయారు. కుటుంబ సభ్యులు, అత్యంత ఆప్తమిత్రుల సమక్షంలో ఈ నిశ్చితార్థ వేడుక ఎంతో ఘనంగా జరిగింది.



## అండర్-19 జట్టులోకి సెహ్వాగ్, ద్రవిడ్ కుమారులు

భారత క్రికెట్ దిగ్గజాలు విరేంద్ర సెహ్వాగ్, రాహుల్ ద్రవిడ్ వారసులు మరోసారి వార్తల్లో నిలిచారు. ఆస్ట్రేలియా అండర్-19తో జరగనున్న సిరీస్‌కు భారత జట్టులో ఆర్యవీర్ సెహ్వాగ్, అన్వయ్ ద్రవిడ్‌కు చోటు దక్కింది. భారత్-ఆస్ట్రేలియా అండర్-19 జట్ల మధ్య మూడు వన్డేలు జరగనున్నాయి. సెప్టెంబర్ 18, 21, 23 తేదీల్లో రాజ్‌కోట్‌లో ఈ మ్యాచ్‌లు జరుగుతాయి. ఆ తర్వాత నాలుగు రోజుల మ్యాచ్‌లు రెండు ఉంటాయి. సెప్టెంబర్ 27 నుంచి 30 వరకు రాజ్‌కోట్‌లో తొలి మ్యాచ్ జరుగుతుంది. అక్టోబర్ 5 నుంచి 8 వరకు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం 'బి' గ్రౌండ్‌లో రెండో మ్యాచ్ ఉంటుంది. వన్డే జట్టుకు లక్ష్య రైచందాని కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. యశ్వర్ధన్ చౌహాన్ వైస్ కెప్టెన్‌గా ఉంటాడు. రెడ్‌బాల్ మ్యాచ్‌లకు చౌహాన్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. రైచందాని వైస్ కెప్టెన్‌గా కొనసాగుతాడు. ఆర్యవీర్ సెహ్వాగ్ ప్రస్తుతం ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో వెస్ట్ ఢిల్లీ లయన్స్‌కు ఆడుతున్నాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు రెండు మ్యాచ్‌లు ఆడాడు.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# దూకుడు తప్పు కాదు.. దిశ ముఖ్యం!

క్రికెట్ మైదానం కేవలం పరుగులు, వికెట్లు, గెలుపోటముల వేదిక మాత్రమే కాదు. అక్కడ భావోద్వేగాలు ఉంటాయి. ఒత్తిడి ఉంటుంది. ప్రత్యర్థిపై పైచేయి సాధించాలన్న తపన ఉంటుంది. ఆ క్రమంలో మాటామాటా పెరగడం, ఆవేశం బయటపడటం కూడా అప్పుడప్పుడు సహజమే. అయితే శ్రీలంక క్రికెటర్లతో వైభవ్ సూర్యవంశీ, యశస్వి జైస్వాల్ వ్యవహరించిన తీరుపై పలువురు సీనియర్లు అభ్యంతరం వ్యక్తం చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సీనియర్ల ఆందోళనను పూర్తిగా కొట్టిపారేయలేం. ఆటకు కొన్ని హద్దులు ఉన్నాయి. ప్రత్యర్థిని గౌరవించడం, క్రీడాస్ఫూర్తిని కాపాడటం, జాతీయ జట్టు ప్రతిష్ఠను నిలబెట్టడం ప్రతి ఆటగాడి బాధ్యతే. ముఖ్యంగా అంతర్జాతీయ వేదికపై ప్రతి చిన్న చర్యకూ పెద్ద అర్థం వస్తుంది. కెమెరాలు ప్రతి కదలికను రికార్డు చేస్తాయి. సోషల్ మీడియా ప్రతి మాటను క్షణాల్లో ప్రపంచానికి చేరవేస్తుంది. అందుకే ఆటగాడి ప్రతిభతో పాటు ప్రవర్తన కూడా అంతే ముఖ్యం. కానీ ఇక్కడ మరో కోణాన్ని కూడా చూడాలి. నేటి జెన్ జీ తరం ఆటగాళ్లను నిన్నటి ప్రమాణాలతో కొలవడం ఎంతవరకు సమంజసం? జెన్ జీ ఆటగాళ్లు భిన్నమైన వాతావరణంలో పెరిగారు. చిన్న వయసులోనే ప్రపంచ క్రికెట్‌ను చూశారు. అంతర్జాతీయ ఆటగాళ్లతో కలిసి ఆడుతున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయడం వారికి సహజం. పోటీతత్వం వారి ఆలోచనా విధానంలో భాగమైంది. వారు భయపడకుండా ప్రశ్నిస్తారు. వెనక్కి తగ్గకుండా తమను తాము వ్యక్తీకరిస్తారు. మైదానంలో ప్రత్యర్థికి ఎదురెళ్లడాన్ని కూడా ఆత్మవిశ్వాసంలో భాగంగానే చూస్తారు. అందుకే వారి దూకుడును పూర్తిగా అణచివేయాలని ప్రయత్నిస్తే మొదటికే మోసం వస్తుంది. ఆటగాడిలో ఉండాల్సిన ఆత్మవిశ్వాసాన్ని, పోరాట పటిమను, గెలవాలన్న కసిని 'అహంకారం'గా ముద్ర వేయడం ప్రమాదకరం. ఒక బ్యాటర్ ప్రత్యర్థి బౌలర్ కళ్లలోకి చూస్తూ ఆడటం తప్పు కాదు. ఒక ఆటగాడు తన జట్టు కోసం గట్టిగా నిలబడటం తప్పు కాదు. ప్రత్యర్థికి తలవంచకుండా పోరాడటం కూడా క్రీడాస్ఫూర్తికి విరుద్ధం కాదు. అసలు సమస్య దూకుడులో లేదు.. ఆ దూకుడు హద్దులు దాటినప్పుడే సమస్య. ఇదే తేడాను సీనియర్లు కొత్త తరానికి నేర్పాలి. 'మా కాలంలో ఇలా ఉండేది కాదు' అంటూ యువ ఆటగాళ్లను మందలించడం సులభం. కానీ 'ఎలా ఉండాలి' అనేది నేర్పడం అసలైన బాధ్యత. నియంత్రణ పేరుతో వారి సహజ స్వభావాన్ని అణచివేయడం కంటే, ఆ శక్తిని సరైన దిశలో మళ్లించడం అవసరం. వైభవ్ సూర్యవంశీ లాంటి యువ ఆటగాళ్లు చిన్న వయసులోనే భారీ అంచనాల మధ్య అంతర్జాతీయ క్రికెట్ వైపు అడుగులు వేస్తున్నారు. జైస్వాల్ వంటి ఆటగాళ్లు కూడా దూకుడు, నిర్భయమైన బ్యాటింగ్‌తో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అలాంటి ఆటగాళ్లలోని 'ఫైర్'ను చల్లార్చేయడం భారత క్రికెట్‌కు మేలు చేయదు. అదే సమయంలో ఆ మంట ప్రత్యర్థిని కాల్చేంతగా కాకుండా, తమ ఆటను వెలిగించేంతగా ఉండేలా చూడాలి. యువ ఆటగాడు తప్పు చేస్తే మందలించాలి. కానీ అవమానించకూడదు. అతని ఆత్మవిశ్వాసాన్ని పగలగొట్టకూడదు. మైదానంలో దూకుడుగా ఉండొచ్చు.. మైదానం బయట వినయంగా ఉండటం నేర్పాలి. ప్రత్యర్థిపై పోరాడొచ్చు.. ప్రత్యర్థిని వ్యక్తిగతంగా ద్వేషించకూడదని చెప్పాలి. గెలుపు కోసం చివరి బంతి వరకు పోరాడొచ్చు.. ఓటమిని కూడా గౌరవంగా స్వీకరించడం నేర్పాలి. క్రికెట్ మారుతోంది. ఆటగాళ్ల వ్యక్తిత్వాలు మారుతున్నాయి. ఆట వేగం పెరుగుతోంది. ప్రేక్షకుల అంచనాలు మారుతున్నాయి. ఈ మార్పును అర్థం చేసుకోకుండా పాతకాలపు క్రమశిక్షణను యువతపై రుద్దాలని ప్రయత్నిస్తే సంఘర్షణ తప్పదు. 'యువ ఆటగాళ్లను అదుపులో పెట్టాలి' అనే కోణంలో చూడటం కంటే, 'వారి దూకుడుకు సరైన దిశ చూపాలి' అనే కోణంలో చూడాలి.



రక్తసంబంధం రాఖీ పండుగ
అన్నా చెల్లెల అనుబంధం రాఖీ పండుగ
ఆత్మీయతను పంచే రాఖీ పండుగ
రాఖీ కట్టి రక్షణగా ఉండాలని కోరే చెల్లె!!!

## అన్నా చెల్లెలి రాఖీ బంధం

ఆగస్టు నెలలో వచ్చే ఆనందమైన పండుగ
ఆడపిల్లలకు ఆనందానిచ్చే పండుగ
అన్నా చెల్లెల్ని ఒక్కటి చేసే రక్షాబంధన్
మమత అనురాగాలను పంచే పండుగ!!!

అందరినీ ఒక్కటిగా చేసే రక్షాబంధన్
అవనిలో ఆడపిల్లలకు గౌరవాన్ని ఇచ్చే పండుగ
అన్నాతమ్ముళ్లకు అనుబంధానికి వారధిగా రక్షాబంధన్
అన్న తమ్ముళ్లు అన్నిట్లో విజయం గా ఉండాలని కోరే అక్కచెల్లెలు!!!

అందమైన అనుబంధం అంతులేని అనురాగం
అన్నాచెల్లెల బంధం రక్షాబంధన్!!!

నీవు నాకు రక్ష నేను నీకు రక్ష
మనమిద్దరం కలిసి దేశానికి రక్షణగా ఉందాం
రక్షాబంధన్ శుభాకాంక్షలు!!!



దేవులపల్లి రమేశ్
(కవి, రచయిత )
కలం : వామిక శ్రీ వర్ష
నంగునూర్, సిద్దిపేట జిల్లా
ఫోన్ నంబర్:9963701294

# బంధాల విలువను తెలిపే రాఖీ

**సంబంధాలు పెరుగుతున్నాయి.. కానీ బాంధవ్యాలు తగ్గుతున్నాయి. మనుషుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ ఒంటరితనం పెరుగుతోంది. సాంకేతికత దూరాలను తగ్గించినా.. మనసుల మధ్య దూరాలను మాత్రం పెంచుతున్న సందర్భాలు ఎన్నో. ఇలాంటి కాలంలో ప్రతి బంధానికీ ఒక విలువ ఉందని, ప్రతి మనిషికీ మరొక మనిషి అండగా నిలవాల్సిన బాధ్యత ఉందని గుర్తుచేసే పర్వదినమే రక్షాబంధనం.**

శ్రావణ పౌర్ణమి వచ్చిందంటే ఇళ్లలో సందడి కనిపిస్తుంది. చెల్లెలి చేతిలో రాఖీ.. అన్నయ్య నుదుటిపై తిలకం.. చేతికి తోరం.. నోటికి తీపి.. మనసుల్లో అనురాగం. ఇవన్నీ కలిపి ఒక పండుగ వాతావరణాన్ని సృష్టిస్తాయి. కానీ రాఖీ అసలు గొప్పతనం ఆ ఒక్కరోజు జరిగే ఆచారంలో లేదు. జీవితాంతం ఒకరికి ఒకరు తోడుగా ఉండాలనే హామీలో ఉంది. రాఖీ కట్టే చేతి వెనుక ప్రేమ ఉంటుంది. ఆ ప్రేమకు ప్రతిస్పందనగా రక్షణ ఉంటుంది. అయితే రక్షణ అంటే కేవలం ఆపదలో కాపాడటం మాత్రమే కాదు. బాధలో ఓదార్పు ఇవ్వడం.. విజయ సమయంలో ప్రోత్సహించడం.. తప్పు చేసినప్పుడు సరిదిద్దడం.. కష్టకాలంలో అండగా నిలవడం.. అవసరమైనప్పుడు చేయూతనివ్వడం.. ఇవన్నీ రక్షణలో భాగమే. అందుకే రక్షాబంధనం ఒక కుటుంబ పండుగ మాత్రమే కాదు. బంధాల విలువను గుర్తుచేసే సామాజిక సందేశం. భారతీయ సంస్కృతిలో పండుగలకు ఒక ప్రత్యేకత ఉంది. ప్రతి పండుగ వెనుక ఒక ఆధ్యాత్మిక భావన మాత్రమే కాకుండా, ఒక సామాజిక ప్రయోజనం కూడా ఉంటుంది. రక్షాబంధనం కూడా అలాంటిదే. కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడం, సోదరసోదరీమణుల మధ్య అనురాగాన్ని పెంచడం, పరస్పర బాధ్యతను గుర్తుచేయడం దీని అంతరార్థం. కాలం మారింది. ఉమ్మడి కుటుంబాలు చిన్న కుటుంబాలుగా మారాయి. ఉద్యోగాలు, చదువులు, ఉపాధి అవకాశాల కోసం పిల్లలు వివిధ నగరాలకు, దేశాలకు వెళ్లిపోతున్నారు. ఒకప్పుడు ప్రతిరోజూ కలిసి కనిపించిన అన్నాచెల్లెళ్లు ఇప్పుడు ఏడాదికి ఒకసారి కలుసుకునే పరిస్థితి ఏర్పడింది. అయినప్పటికీ రాఖీ రోజు మాత్రం ఎక్కడున్నా బంధాన్ని గుర్తుచేసుకుంటారు. చేతికి రాఖీ చేరకపోయినా.. ఒక సందేశం చేరుతుంది. ఒక ఫోన్‌కాల్ వస్తుంది. ఒక వీడియోకాల్‌లో ఆప్యాయత పంచుకుంటారు. ఇదే రాఖీ ప్రత్యేకత. దూరం పెరిగినా బంధం తగ్గకూడదని చెప్పే పండుగ ఇది. అయితే రక్షాబంధనాన్ని కేవలం అన్నయ్య చెల్లెలిని కాపాడాలనే భావనకే పరిమితం చేయడం కాలానుగుణం కాదు. నేటి సమాజంలో మహిళలు తమ జీవితాలను తాము నిర్మించుకుంటున్నారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం, పాలన, శాస్త్రసాంకేతిక రంగాలు.. ప్రతి రంగంలోనూ మహిళలు తమ సామర్థ్యాన్ని చాటుతున్నారు. కాబట్టి సోదరుడి బాధ్యత అంటే సోదరిని కాపాడటమే కాదు.. ఆమె స్వేచ్ఛను గౌరవించడం, ఆమె నిర్ణయాలకు తోడుగా నిలవడం, ఆమె కలలకు అండగా ఉండటం. అదే నిజమైన రక్షణ. అలాగే సోదరి కూడా అన్నయ్యకు ప్రేమను, ఆత్మీయతను, ధైర్యాన్ని అందించే వ్యక్తే. జీవితంలోని ప్రతి మలుపులో ఒకరి వెనుక ఒకరు నిలబడే బంధమే అన్నాచెల్లెళ్ల అనుబంధం. అందుకే రాఖీ ఒకపక్ష బంధం కాదు.. పరస్పర బాధ్యతకు ప్రతీక. ఇంకా విస్తృతంగా చూస్తే రక్షాబంధనం మనిషి--మనిషి మధ్య ఉండాల్సిన నమ్మకాన్ని గుర్తుచేస్తుంది. ఈ సమాజంలో మనకు రక్తసంబంధం లేని ఎంతోమంది మనుషులు ఆపదలో అండగా నిలుస్తున్నారు. సైనికుడు సరిహద్దులో దేశాన్ని కాపాడుతున్నాడు. పోలీసు ప్రజల భద్రత కోసం పనిచేస్తున్నాడు. వైద్యుడు ప్రాణాలను నిలబెడుతున్నాడు. రైతు సమాజానికి అన్నం అందిస్తున్నాడు. పారిశుద్ధ్య కార్మికుడు మన నగరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నాడు. ప్రకృతి పరిరక్షకుడు భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని కాపాడుతున్నాడు. రక్షణ అనేది ఒకరి బాధ్యత మాత్రమే కాదు.. సమాజం మొత్తం పంచుకోవాల్సిన విలువ. అందుకే ఈ రాఖీ పండుగనాడు మనం ఒక కొత్త సంకల్పం తీసుకోవాలి. మన కుటుంబంలోనే కాదు.. మన చుట్టూ ఉన్న ప్రతి మనిషి పట్ల బాధ్యతతో వ్యవహరించాలి. ఆడపిల్ల భద్రతను కుటుంబ సమస్యగా కాకుండా సామాజిక బాధ్యతగా చూడాలి. వృద్ధుల ఒంటరితనాన్ని గుర్తించాలి. ఆపదలో ఉన్నవారికి చేతనైనంత సహాయం చేయాలి. ప్రకృతిని కాపాడాలి. మాటల్లోనే కాకుండా చేతల్లోనూ మానవత్వాన్ని చూపాలి. పురాణాలు రక్షాబంధనానికి ఎన్నో కథలను అందించాయి. దేవతలు, దానవులు, రాజులు, రాణులు, సోదరసోదరీమణుల అనుబంధాలకు సంబంధించిన అనేక గాథలు ఈ పర్వదినానికి ప్రాశస్త్యాన్ని చేకూర్చాయి. వాటి చారిత్రకతపై భిన్నాభిప్రాయాలు ఉన్నా.. వాటి నుంచి వెలువడే ప్రధాన సందేశం మాత్రం ఒక్కటే-నమ్మిన బంధాన్ని కాపాడటం. ఆ సందేశమే నేటి సమాజానికి అత్యంత అవసరం. ఎందుకంటే ప్రస్తుతం మనకు సాంకేతికత ఉంది.. కానీ సమయం లేదు. పరిచయాలు ఉన్నాయి.. కానీ ఆత్మీయత తగ్గుతోంది. సామాజిక మాధ్యమాల్లో వేలాది మంది స్నేహితులు ఉన్నా.. నిజమైన కష్టంలో పక్కన నిలిచే మనిషి కోసం వెతకాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో రాఖీ మనకు ఒక చిన్న ప్రశ్న వేస్తుంది. మన చేతికి కట్టుకున్న దారాన్ని మాత్రమే కాపాడుతున్నామా? లేక ఆ దారంతో ముడిపడిన బంధాన్ని కూడా కాపాడుతున్నామా? రాఖీని కట్టడం సులభం. కానీ ఆ బంధాన్ని జీవితాంతం నిలబెట్టుకోవడం గొప్ప విషయం. కానుక ఇవ్వడం సులభం. కానీ అవసరమైన సమయంలో చేయూతనివ్వడం అసలైన బహుమతి. రాఖీ ఫొటోను సామాజిక మాధ్యమంలో పెట్టడం సులభం. కానీ సోదరి కన్నీటిని తుడవడం.. అన్నయ్య కష్టాన్ని అర్థం చేసుకోవడం.. అదే నిజమైన బాంధవ్యం. అందుకే ఈ రక్షాబంధనం కేవలం 'రాఖీ కట్టే పండుగ'గా కాకుండా 'బంధాలను కాపాడే పండుగ'గా మారాలి. మన ఇంట్లో బంధాలు బలపడితే కుటుంబం బలపడుతుంది. కుటుంబాలు బలపడితే సమాజం బలపడుతుంది. సమాజంలో పరస్పర విశ్వాసం పెరిగితే దేశం మరింత మానవీయంగా మారుతుంది. చేతికి కట్టే చిన్న దారం.. ఇంత పెద్ద సందేశాన్ని మోసుకెళ్లడం భారతీయ సంస్కృతి ప్రత్యేకత. రాఖీ దారం తెగిపోవచ్చు.. కానీ దానితో ముడిపడిన ప్రేమ తెగకూడదు. రక్షాబంధనం మనకు ఇచ్చే అసలైన సందేశం ఇదే.. బంధాన్ని కట్టుకోవడం కాదు.. బంధాన్ని నిలబెట్టుకోవడం. ప్రేమను చెప్పుకోవడం కాదు.. అవసరమైనప్పుడు చూపించడం. రక్షణ కోరడం కాదు.. ఒకరికొకరం రక్షణగా నిలవడం. అదే రాఖీ పండుగకు అసలైన అర్థం. అదే భారతీయ బాంధవ్య సంస్కృతికి అసలైన అందం.





రాంమనోహర్ శర్మ,
ఆధ్యాత్మిక పండితుడు,
81061 94150

# ఎన్ని రాఖీలు పోవాలి.. ఎన్ని బతుకమ్మలు రావాలి?

రాఖీ పండుగ అంటే అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక. అన్నయ్యకు రాఖీ కట్టి, తనకు అండగా నిలవాలని చెల్లెలు కోరుకుంటుంది. కానీ తెలంగాణలోని లక్షలాది మంది మహిళలు ఇప్పుడు తమ అన్నలనే కాదు.. తమను పాలిస్తున్న ప్రభుత్వాన్నీ ఒక ప్రశ్న అడుగుతున్నారు. "మాకు ఇస్తామన్న ఆర్థిక సాయం ఎప్పుడిస్తరు?" ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ప్రజల ఆశలను పెంచుతాయి. ముఖ్యంగా మహిళలకు సంబంధించిన హామీలు కుటుంబ ఆర్థిక పరిస్థితిపై నేరుగా ప్రభావం చూపుతాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మహిళలకు నెలకు ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చింది. ఆ హామీపై మహిళలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం ఏర్పడి కాలం గడుస్తున్నా.. ఆ హామీ అమలుకు మాత్రం స్పష్టమైన కాలపట్టిక కనిపించకపోవడం ప్రశ్నార్థకంగా మారింది. రాఖీ పండుగ వచ్చింది.. వెళ్లింది. మళ్లీ రాఖీ వచ్చింది. బతుకమ్మ పండుగలు వచ్చాయి.. వెళ్లాయి. కానీ హామీ మాత్రం హామీగానే మిగిలిపోతే ఎలా? ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చే హామీలు కేవలం రాజకీయ ప్రకటనలు కావు. అవి ప్రజలతో చేసుకున్న నైతిక ఒప్పందం. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను అమలు చేయడానికి ఆర్థిక వనరులు, విధివిధానాలు, లబ్ధిదారుల గుర్తింపు వంటి అంశాలను ప్రభుత్వం నిర్ణయించుకోవచ్చు. కానీ ఎప్పటిలోగా అమలు చేస్తామో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత మాత్రం ప్రభుత్వానిదే. మహిళలకు ఆర్థిక సాయం అంటే కేవలం వారి చేతిలో కొంత డబ్బు పెట్టడం కాదు. అది కుటుంబ ఆర్థిక వ్యవస్థకు ఒక చిన్న భరోసా. ఇంటి ఖర్చులు, పిల్లల చదువులు, వైద్యం, నిత్యావసరాలు, చిన్నచిన్న అవసరాలు.. ఇలా మహిళలు కుటుంబంలో ఎన్నో బాధ్యతలు మోస్తుంటారు. వారికి అందే ప్రతి రూపాయి కుటుంబానికే ఉపయోగపడుతుంది. అందుకే మహిళల కోసం ప్రకటించే సంక్షేమ పథకాలను రాజకీయ హామీలుగా కాకుండా సామాజిక పెట్టుబడిగా చూడాలి. అయితే ఇక్కడ మరో ముఖ్యమైన ప్రశ్న కూడా ఉంది. ప్రభుత్వం ఆ హామీని అమలు చేయగల ఆర్థిక స్తోమత కలిగి ఉందా? ఉంటే ఎప్పుడు అమలు చేస్తుంది? లేకుంటే ఎందుకు సాధ్యం కావడం లేదు? ఈ రెండు ప్రశ్నలకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలి. ప్రజలను ఎదురుచూపుల్లో ఉంచడం సరైన పరిపాలనా విధానం కాదు. ఎన్నికల ముందు ఒక మాట.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాట అనే పరిస్థితి ప్రజల్లో విశ్వాస సంక్షోభాన్ని సృష్టిస్తుంది.

ప్రభుత్వాలు మారుతుంటాయి. కానీ ప్రజల నమ్మకం ఒక్కసారి దెబ్బతింటే దాన్ని తిరిగి సంపాదించడం అంత సులభం కాదు. రేవంత్ ప్రభుత్వం ఇప్పటికే అనేక హామీల అమలుపై ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఆర్థిక పరిస్థితులు, అప్పుల భారం, గత ప్రభుత్వ నిర్ణయాల ప్రభావం వంటి కారణాలను ప్రభుత్వం ప్రస్తావించవచ్చు. అవి పరిపాలనా పరంగా వాస్తవ సమస్యలే కావచ్చు. కానీ ప్రజలకు ఇచ్చిన హామీని ఎంతవరకు, ఏ రూపంలో, ఎప్పటి నుంచి అమలు చేస్తామన్న విషయాన్ని స్పష్టంగా చెప్పడం మాత్రం ప్రభుత్వ బాధ్యత. మహిళలకు ఇచ్చిన హామీ విషయంలో మరింత పారదర్శకత అవసరం. అర్హులైన మహిళలు ఎంతమంది? ఇందుకు సంవత్సరానికి ఎంత ఖర్చవుతుంది? బడ్జెట్‌లో ఎంత కేటాయించారు? పథకం ఎప్పుడు ప్రారంభమవుతుంది? ఒకేసారి ఇస్తారా? నెలవారీగా ఇస్తారా? ఇప్పటికే ఏమైనా కార్యాచరణ ప్రారంభమైందా? ఈ వివరాలను ప్రభుత్వం ప్రజల ముందుంచాలి. పండుగల సమయంలో మహిళలను ఉద్దేశించి ప్రభుత్వాలు చేసే ప్రకటనలకు ఒక ప్రత్యేకమైన భావోద్వేగ విలువ ఉంటుంది. రాఖీ రోజున చెల్లెళ్లను గుర్తు చేసుకోవడం, బతుకమ్మ సమయంలో మహిళా సాధికారత గురించి మాట్లాడడం మంచిదే. కానీ పండుగల వేదికలపై మాటలు చెప్పడం కంటే.. హామీని ఆచరణలో పెట్టడమే నిజమైన గౌరవం. మహిళలు అడుగుతున్నది దానం కాదు. ఎన్నికల సమయంలో తమ ఓట్లను కోరుతూ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మాత్రమే కోరుతున్నారు. హామీ ఇచ్చింది ఎవరు అన్నది కంటే.. దాన్ని ఎప్పుడు నెరవేరుస్తారన్నదే ఇప్పుడు ముఖ్యం. ఒక రాఖీ పోయింది.. మరో రాఖీ వచ్చింది. బతుకమ్మలు ఎన్నో వచ్చాయి.. వెళ్లాయి. ప్రతి పండుగ మహిళలకు ఆనందాన్ని ఇవ్వాలి. కానీ అదే పండుగ రోజున "మాకు హామీ ఇచ్చిన డబ్బులు ఎప్పుడొస్తాయి?" అనే ప్రశ్న మళ్లీ మళ్లీ వినిపిస్తే అది ప్రభుత్వానికి ఆత్మపరిశీలనకు సంకేతం. రేవంత్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీపై ఇక స్పష్టమైన ప్రకటన చేయాల్సిన సమయం వచ్చింది. ఇస్తారా? ఇస్తే ఎప్పటి నుంచి ఇస్తారు? ఎంత ఇస్తారు? ఎవరికిస్తారు? అన్నది ప్రజలకు చెప్పాలి. ఎందుకంటే ప్రజాస్వామ్యంలో హామీకి విలువ ఉంటుంది. ఓటుకు విలువ ఉంటుంది. ప్రజల విశ్వాసానికి అంతకంటే ఎక్కువ విలువ ఉంటుంది. చెల్లెమ్మలు మరో రాఖీ కోసం ఎదురుచూడాలా? మరో బతుకమ్మ పండుగ వచ్చే వరకు ఆగాలా? లేక ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టి.. వారి ఖాతాల్లో హామీ సొమ్ము జమ చేయబోతుందా? సమాధానం చెప్పాల్సింది ఇక ప్రభుత్వం.



నవీన్ పోగుల
బీఆర్ఎస్ సీనియర్ నేత

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.